ENTERED

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

కథా నిలయం
శ్రీకాకుళం

మే 18 2008

గుడ్డిగుర్రాలకు భారీ దాణా !

హ్యాపీబర్త్‌డే

(2008 మే-18 నుంచి
2008 మే-24 వరకు)

పి. జాహ్నవి
2సం॥, మే-19
నిర్మల-సురేష్‌బాబు
రాజమండ్రి-తూ॥గో



బి. మోక్ష
1సం॥, మే-18
లావణ్య-దామోధర్
అస్మత్‌పూర్-రంగారెడ్డి

ఎం. శ్రీజ
5సం॥, మే-18
వరలక్ష్మి-మహేందర్
కాచిగూడ-హైదరాబాద్

ఎ. స్రవంతి
9సం॥, మే-21
లక్ష్మి-సువర్ణరాజు
శింగరాయకొండ-ప్రకాశం

టి. మనీషా
1సం॥, మే-2007
భాగ్యమ్మ-జనార్ధన్
అడ్డగుట్ట-సికింద్రాబాద్

జి.కోటేష్
1సం॥, మే-2007
సుజాత-సురేష్‌కుమార్
పాకబండబజార్-ఖమ్మం

ఎ. రమేష్ కళ్యాణ్
7సం॥, మే-24
నాగలక్ష్మి-నవీన్
జగ్గయ్యపేట-కృష్ణా

ఎన్. కావ్య
4సం॥, మే-21
ఉషారాణి-కృష్ణ మోహనరావు

ఎన్. సోహాన్
3సం॥, మే-19
రజని-భాస్కర్
ఖమ్మం

ENTERED

ఇగో తగ్గించుకుంటే సమాజానికి మేలు

మన అతిథి

పేరు : చొప్పల రత్నం

చదువు : డబుల్ ఎంఎ, పిహెచ్‌డి

తల్లిదండ్రులు : చొప్పల శాంతమ్మ, అమృతరావు

పుట్టినతేదీ : 27-6-1948

సొంత ఊరు : అద్దాల పాళ్యం, తూర్పుగోదావరి జిల్లా

ప్రస్తుత నివాసం : ఎస్‌వియూ వైస్‌ఛాన్సలర్ బంగ్లా, తిరుపతి

వృత్తి : శ్రీ వెంకటేశ్వరా యూనివర్శిటీ ఉపకులపతి

ఇష్టమైనది : సామాజిక సమస్యలపై అధ్యయనం చేయడం

ఇష్టపడనిది : ఎక్కువగా మాట్లాడటం

గుర్తింపు : 1976 ఆంధ్రా యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా ప్రవేశం. టీచింగ్, రీసెర్చ్ చేయడంలో మంచి గుర్తింపు. గొప్ప అడ్మినిస్ట్రేటర్‌గా పేరు. వీటన్నింటిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 2008లో ఎస్‌వియూ వైస్‌ఛాన్సలర్‌గా నియమించింది.

లక్ష్యం : ప్రఖ్యాత ఎస్‌వి యూనివర్శిటీని ఉన్నత స్థాయికి తీసుకురావడమే

ప్రతి ఒక్కరిలోనూ ఇగో ఉంటుంది. ఇది ప్రకృతి సహజం. ఎవరో ఒకరిని కించ పరచాలనో, కిందకు లాగాలనో చూస్తుంటారు. ఇగోను తగ్గించుకుంటే సమాజానికి మేలు. సమాజంలో వ్యత్యాసాలు తగ్గితేనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుంది. ఇప్పటికే ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థాయిలో వున్న వారు కింద స్థాయిలో ఉన్న అందరి సమస్యలు పరిష్కరించేలా మానవత్వంతో వ్యవహరించాలి.

ఈ సంచికలో....

టపా	...	2
నేర్చుకుందామా	...	3
సీరియల్	...	8
సినిమా కబుర్లు	...	10
ఆరోగ్యం	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14

ఇంకా...



చూద్దామా ... 4

అబ్బో... మౌంట్ అబు

మంచిపుస్తకం ...6

అభివృద్ధి జపమా, అట్టడుగు జనమూ...

సలహాలు	...	17
లాహిరి	...	20
విజ్ఞాన వీచిక	...	22
కొత్త పుస్తకాలు	...	24

కథ ... 18

మేమూ సమాజంలో భాగమే...



వాస్తవానికి అద్దం పట్టిన కథ

'ఆంధ్రా ఊటీలు' కవర్ స్టోరీ ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నాం. బొర్రా గుహలు, వాటి చరిత్ర గురించి చాలా విషయాలు తెలుసుకున్నాం. "పాప తల్లి కథ వాస్తవానికి అద్దం పట్టింది. నిజ జీవితంలో ఉద్యోగినులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అందులో ఇది ఒక సమస్య. 'గుప్పెడు గుండెను కాపాడుకొందాం' సైన్సు వ్యాసం విజ్ఞానదాయకంగా వుంది. "సమగ్ర వ్యాసావళి" పుస్తక పరిచయం వలన చాలా విషయాలు తెలుసుకున్నాం. అందరూ చదవదగిన పుస్తకం.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

వేసవిని మరిపించిన కవర్

మే 4 ఆదివారం అనుబంధం వేసవిని మరిపించింది. ప్రకృతి అందాలకు నెలవులైన అరకులోయ, బొర్రా గుహలు, మదనపల్లి విశేషాలను పరిచయం చేసినందుకు చాలా సంతోషం. చదువుకున్నంత సేపూ చల్లగా అనిపించింది. మన అతిథి శివాజీ గారు అన్నట్టు ఏదో విధంగా సంపాదించాలనే ఆలోచన కూడదు. నీరు మాత్రమే తాగుతూ...కూడా ఆరోగ్యంగా ఉండే కృష్ణ కుమారి జీవితం ఆశ్చర్యకరంగా ఉంది! రాము, సత్తార్ జోకులు సందర్భోచితంగా, నవ్వించేవిగా ఉన్నాయి.

బి. ఎస్.రావ్, విశాఖ.

'లాహిరి' పాత బంగారం

'లాహిరి లాహిరి'లో చదివినప్పటి నుంచి ప్రజాశక్తి రెగ్యులర్ పాఠకులం అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నాం. డా॥ జె.పి. వైద్య స్టైలు, సున్నితమైన హాస్యం తీరు ఆసాంతం ఆకట్టుకుంటోంది. అలనాటి అందాలు ఈ తరం వాళ్ళకు అంతగా తెలియవు. అవన్నీ తెరమరుగున పడిపోతున్నాయన్న వ్యథ కూడా వారి రచనల్లో కన్పిస్తూ వుంటుంది. ఏ రోజైనా కానీండి. ఓల్డ్ ఈజ్ గోల్డ్. భారతీయ సినీ ప్రపంచంలో ఇంకా ఇతర భాషల్లో ఉన్న చిత్ర విచిత్రాలనూ అందించమనండి. స్వీకరించడం మా అదృష్టం. అంత కృషి చేస్తున్న మీరు అభినందనీయులు. కేవలం ఎర్ర రంగు కేనేమో పత్రిక అనే అపోహలను ఇలాంటి రచనలు దూరం చేస్తాయి. ఇంకా ఎన్నో రచనలు మేమూ చదవాలి. మీరు అందించాలి.

వి. వి., తిరుపతి.

కవర్ దిక్సూచిగా ఉపయోగపడుతుంది

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం 4 మే స్నేహలో అందించిన ఓ మంచి పుస్తకం విశేషాలు చాలా బాగున్నాయి. అన్ని రంగాలకు సంబంధించిన అంశాలను పొందుపరచి 'సమాచార సమృద్ధియైన సమగ్ర వ్యాసావళి'గా ముద్రించడం ఓ గొప్ప విషయం. అట్టమీది కథలో 'ఆంధ్రా ఊటీ' ఊసులు గురించి వివరించిన తీరు బాగుంది. ప్రకృతి పారవశ్యంతో మునిగి తేలుతూ, అవధులు లేని ఆనందాన్ని సొంతం చేసుకుంటూ, విశాఖ ఏజెన్సీలోని అందాలను తనివితీరా ఆస్వాదించే అవకాశం స్నేహ ద్వారా నాకు దక్కిందని అనుకుంటున్నాను. బొర్రా గుహలకు ఆ పేరు ఎలా వచ్చింది? బొర్రా విహార యాత్రలో రైలు ప్రయాణంలో కలిగే అనుభూతి నిజంగా నేను ప్రయాణం చేసినట్లు అనిపించింది. జలపాతం, మ్యూజియం, గుహలు, కొండలు జంతువులు, పక్షులు, బొమ్మలు, వాయిద్యాల చుట్టూ ఉన్న అందమైన ప్రదేశాలు ఆకట్టుకునే విధంగా మా కొరకు ముద్రించి ఫొటోలతో ప్రచురించినందుకు నమస్కారాలు. కొత్తగా ఊటీ చూసే వారికి ఈ వారం స్నేహ మంచి దిక్సూచిలా ఉపయోగపడుతుంది. అందుకే వీలు చేసుకొని చూద్దాం! చూసొద్దాం.

కర్రా వర ప్రసాద్,
యలమర్రు, కంద్రిక.

ఆకట్టుకున్న 'ఆంధ్రా ఊటీలు'

ఈ వేసవి సెలవులలో మానసిక ఉల్లాసానికి, పిల్లలకు, పెద్దలకు ఎంతగానో ఉపయోగపడే పర్యాటక స్థలాలను గురించి సవివరంగా వివరించిన 4.5.08 నాటి ఆదివారం ప్రజాశక్తి అనుబంధం అట్టమీది కథ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ వేసవి సెలవులను పూర్తిగా ఎంజాయ్ చేయడానికి ఈ 'ఆంధ్రా ఊటీలు' ఎంత గానో ఉపయోగ పడుతున్నాయి. వచ్చే వారం మరిన్ని ప్రదేశాలను గురించి వివరాలు అందిస్తారని ఆశిస్తున్నాము. అలాగే ఆరోగ్యం శీర్షికలో గుండె పోటు వచ్చే అవకాశాలను గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించిన తాజా పరిశోధనల విశేషాలను తెలుసుకున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో అందరికీ ఎంతో అవసరమైన వ్యాసం ఇది. "చూద్దామా"... శీర్షికలో కాశ్మీర్ లోని చూడదగ్గ ప్రదేశాల విశేషాలను తెలుసుకున్నాం. అచ్చంగా నీరే ఆహారంగా స్వీకరిస్తున్న కృష్ణ కుమారి గురించి చదివి ఆశ్చర్యపోయాం.

వి. విద్యాధరరావు, తిరుపతి.

పులిరాజాను చూసి పిల్లలు ఎంజాయ్ చేశారు

పులిరాజా డెనిస్‌ని చూసి ఆశ్చర్య పోయాం. అసలు చెప్పాలంటే యాభై ఐదు ఆపరేషన్లు చేయించు కోవడం చాలా గ్రేట్. మూతి, బుగ్గలు, చేతి గోళ్ళు, పులిపళ్లను పెట్టుకొని అచ్చం పులిలాగ కనిపించే ఈ పులిరాజా విశేషాలను ఈ వారం స్నేహకి అందించినందుకు అభినందనలు. ముఖ్యంగా పిల్లలు బాగా ఎంజాయ్ చేశారు. ఇంక నుంచి మరచిపోలేని చిత్రవిచిత్రాలు మరిన్ని అందిస్తారని కోరుకుంటున్నాము.

ఎం. జగన్నాథం, విజయనగరం.

కవర్ బాగుంది

స్నేహలో అట్టమీది కథ



'ఆంధ్రా ఊటీలు' బావుంది. పిల్లల నుండి పెద్దల వరకూ సేద తీరే ప్రదేశాలు అవి. సెలవులు పెట్టి విశాఖ ఆర్కే బీచ్‌కో, కొండపల్లి ఖిల్లాకో, బొర్రాగుహలకో, భీమిలి బీచ్‌కో కుటుంబ సభ్యులతో సహా వెళ్లి ఎంజాయ్ చేస్తుంటారు. ముఖ్యంగా ఆకట్టుకునే అరకు జలపాతాలు, మ్యూజియం, పురాతన నీలగిరి వృక్షాలు చూస్తుంటారు. ముఖ్యంగా అరకులో వెదురుకర్రతో గిరిజనులు చేసిన రకరకాల బొమ్మలు చాలా విచిత్రంగా ఉంటాయి. కవర్ విశేషాలు మమ్మల్ని ఆనందంలో ముంచెత్తాయి. ఈ ప్రదేశాలు చూడడానికి వచ్చిన జనం ఆ ప్రదేశమంతటా కిటకిటలాడు తుంటారు. బొర్రా గుహల గురించి తెలియజేసినందుకు అభినందనలు.

అనుపోజు సత్యనాగరాజు,
రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.

ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహి తులు, సహోద్యోగులు, ఇరుగు పొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్‌వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

చేప తోక జడ

అల

'అమ్మా...ఎప్పుడూ జడ ఇట్లాగే వేస్తావెందుకు? ఏదైనా వెరైటీగా వేయొచ్చుగా...' అడిగింది చిన్నారి పింకీ... తల్లిని గారాంగా.

'నాకేం రావే తల్లీ. నాకు వచ్చినట్టు నేనేస్తున్నా...ఇష్టమైతే వేయించుకో. లేకపోతే లేదు' ఉడుక్కుంటూ అంది తల్లి.

'ఎదురింటి మిన్నూ చూడు. రోజుకో జడ వేసుకొస్తుంది స్టైల్‌గా. నువ్వు కూడా ఆ ఆంటీలాగే ఏదైనా ట్రై చేయొచ్చుగా....' అంది పెద్ద నాపసానిలా ఫోజుపెట్టి.

'చేస్తా ...చేస్తా... శుభ్రంగా క్రాఫ్ కొట్టించేస్తే ఇంకా స్టైల్‌గా వుంటుంది మా పింకీ...అవునా?' అంది తల్లి నవ్వుతూ.

'నువ్వెప్పుడూ ఇంతేనమ్మా... ఇలా ఏదైనా అడిగినప్పుడల్లా క్రాఫ్ చేయించేస్తానంటావ్...ఇవాళ నేను ఎదురింటి ఆంటీనడిగి వెరైటీ జడ వేయించుకుంటా. అందుకు ఒప్పు కోమ్మా.. ప్లీజ్ అమ్మా...' బతిమాలింది పింకీ.

అచ్చంగా ఇలాంటి అల్లరి పింకీల కోసమే ఈ చేపతోక జడ. పెద్ద కష్టం వుండదు. ఈజీగా వేసేయొచ్చు. మరి ప్రయత్నిస్తారా!

1.ముందు తల శుభ్రంగా దువ్వి పోనీకి మల్లే రబ్బర్ బ్యాండ్ వేయాలి. మామూలుగా అయితే మనం మూడు పాయలు చేసి జడ అల్లుకుంటుంటాం కదా. మన వెరైటీ జడకు అలా కాదు. వెంట్రుకలను రెండు పాయలుగా తీసుకోవాలి.

2. రెండు పాయలనూ ఎడమ చేత్తోనే పట్టుకోవాలి. తర్వాత కుడి చేతివైపు వున్న పాయలోంచి కొద్దిగా వెంట్రుకలను తీసుకొని ఎడమ చేతివైపు వున్న పాయలో కలపాలి.

3. రెండు పాయలను కుడి చేతిలోకి తీసుకొని... ఎడమ చేతి వైపు వున్న పాయలోని కొన్ని వెంట్రుకలను కుడి చేతి వైపు వున్న పాయలో కలపాలి.

4. మనం ఏ చేతివైపు వున్న పాయలోంచి వెంట్రుకలను తీయాలను కుంటామో ఆ చెయ్యి ఖాళీగా వుండాలి. అవతలి చేతిలో రెండు పాయలూ వుండాలి. ఇలా ఎంత వరకు కావా లంటే అంత వరకు జడ అల్లి...రబ్బర్ బ్యాండ్ వేస్తే సరి. చేప తోక జడ రెడీ.

కాస్త సమయం పట్టినా వెరైటీ జడలు కావాలనుకునే పిల్లలు మాత్రం సంతోషిస్తారు.



ముదురు



చూద్దామా...

యాజీవ్



అబ్బో... మౌంట్ అబు

మౌంట్ అబుపై 11-13 శతాబ్దాలలో నిర్మించిన దిల్వారా గుడులు ఉన్నాయి. తెల్లని పాలరాతితో చెక్కిన ఈ దేవాలయాల్లో అతి పురాతనమైనది విమల్ వసాహి దేవాలయం. దీనిని 1031లో విమల్ షా నిర్మించి మొదట జైన తీర్థంకరకి అంకితమిచ్చాడు. దగ్గరలోనే అచల్‌గర్ కోట ఉంది. మేవార్ రాజైన రాణా కుంభ ఈ కోటని 14వ శతాబ్దంలో నిర్మించాడు. దీని లోపల కూడా చాలా జైన దేవాలయాలు ఉన్నాయి.

రాజస్థాన్ అనగానే వేడి, ఎండ, ఎడారి, ఒంటెలు, రంగు రంగుల వస్త్రాలు గుర్తుకు వస్తాయి. రాచరికమూ, దట్టమైన మీసాలూ, కోటలూ కూడా మదిలో మెదులుతాయి. వీటిలో వేసవి కాలం సేద తీర్చగలవి ఏం వుంటాయి? అనిపిస్తుంది. కానీ ఎడారి ప్రాంతమైన రాజస్థాన్‌లోనూ అత్యంత ఆహ్లాదకరంగా సేద తీర్చగల ఒకే ఒక హిల్‌స్టేషన్-మౌంట్ అబు.

ఒకప్పటి చౌహాన్ రాజుల వేసవి విడిదిగా పేరొందిన మౌంట్ అబు బ్రిటిష్ వారి హయాంలో వారికీ అదే విధంగా ఉపయోగపడింది. రాజస్థాన్ దుమ్ము, వేడి తీవ్రత నుండి తప్పించుకోవడానికీ, బ్రిటీష్ సైనికులు అనారోగ్యం నుంచి కోలుకోవడానికి తరచూ ఈ ప్రదేశాన్ని వాడేవాళ్లు. ఇక్కడ ఇప్పటికీ ఉన్న చిన్న చిన్న గుడిసెలు, ఇతర నిర్మాణాలు అప్పటి కథలని చెబుతాయి.

స్థల పురాణం ప్రకారం చాలా కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇక్కడ 330 మిలియన్ల దేవతలు ఈ పవిత్ర కొండను సందర్శించేవారని అంటారు. మహాముని వశిష్టుడు ఇక్కడ యాగం చేశాడనీ అంటారు. అటువంటి సందర్భంలో ముని తాలూకు ఆవు- నందిని - ఒక లోతైన గుంతలో చిక్కుకుపోతే, వశిష్టుడు శివుణ్ణి వేడుకుంటాడు. శివుడు సరస్వతి నదిని పంపి, ఆ గుంత నింపితే, నందిని ఆ నీటిలో తేలి బయటపడుతుంది. ఇటువంటి ప్రమాదం మళ్ళీ జరగకుండా హిమాలయరాజుని వేడుకొని అర్బుద్ అనే మహా సర్పంతో ఆ గుంతని శాశ్వతంగా మూయిస్తాడు. మౌంట్ అర్బుద్ క్రమేపీ మౌంట్ అబుగా మారింది.

ఈ కొండ జైనులకి చాలా పవిత్రమైన ప్రదేశం. 24వ జైన తీర్థంకరుడైన మహావీరుడు ఈ కొండకి వచ్చి, దీనిని దీవించాడని అంటారు.

అటు హిమాలయాలు, ఇటు నీలగిరి కొండల మధ్య అతి ఎత్తైన కొండ ఇదే. ఆరావళి పర్వత శ్రేణుల్లో భాగమైన అబు పచ్చని చెట్లతో చల్లగా ఉంటుంది. సముద్రమట్టానికి 1220 మీటర్ల ఎత్తున ఉన్న ఈ 22 కిమీ పీఠభూమిని ఎడారిలో ఒయాసిస్సనీ అంటారు. దీనిపైన ఉన్న 'గురు శిఖరం' అత్యున్నత శిఖరం. దీనిపై అనేక సరస్సులు, జలపాతాలు, నదులు కూడా ఉన్నాయి. 290 చదరపు కిమీ పరిధిలో మౌంట్ అబు వన్యప్రాణి సంరక్షణ కేంద్రం కూడా ఉంది. దీనిని









1960లో స్థాపించారు.

మౌంట్ అబుపై 11-13 శతాబ్దాలలో నిర్మించిన దిల్వారా గుడులు ఉన్నాయి. తెల్లని పాలరాతితో చెక్కిన ఈ దేవాలయాల్లో అతి పురాతనమైనది విమల్ వసాహి దేవాలయం. దీనిని 1031లో విమల్ షా నిర్మించి మొదట జైన తీర్థంకరకి అంకితమిచ్చాడు.

దగ్గరలోనే అచల్‌గర్ కోట ఉంది. మేవార్ రాజైన రాణా కుంభ ఈ కోటని 14వ శతాబ్దంలో నిర్మించాడు. దీని లోపల కూడా చాలా జైన దేవాలయాలు ఉన్నాయి.

మౌంట్ అబుపై నక్కి సరస్సు ఉంది. దీనికి దగ్గరలోనే రఘునాథ దేవాలయం, జైపూర్ మహారాజ భవనం ఉన్నాయి. ఇంకా అనేక హిందూ దేవాలయాలతో పాటు 'బ్రహ్మకుమారి' (సన్యాసినుల సంస్థ) ప్రపంచ హెడ్‌క్వార్టర్స్ కూడా ఇక్కడే ఉంది. ఈ సంస్థకే చెందిన ప్రపంచ ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయం కూడా ఇక్కడే ఉంది.

నక్కి సరస్సు వెనకాల కూడా ఒక కథ ఉంది. అబు రాజు కుమార్తె ఒక సన్యాసి - బలమ్ రసియా- ని ప్రేమిస్తుంది. ఆ ప్రేమను ఆ రాకుమార్తె సవతి తల్లి ఒప్పుకోదు. ఆమె విధించిన ఒకానొక నిభంధన ప్రకారం బలమ్ రసియా తన గోళ్లతో ఈ సరస్సును చేశాడని అంటారు. నఖ్-నఖాలు -గోళ్లు- అలా ఈ చెరువు పేరు నక్కి సరస్సు అయింది. విఫల ప్రేమకు గుర్తుగా ఇక్కడ 'కువారి కన్య' గుడి, బలమ్ రసియా విగ్రహం కూడా వున్నాయి.

అనేక దేవాలయాలు, పార్కులతో ఎడారిలో నిజంగానే ఒయాసిస్సులా అనిపించే మౌంట్ అబు చూడవలసిన ప్రదేశమే. ఉండటానికి రాజస్థాన్‌లోనే ఉన్నా మౌంట్ అబు గుజరాత్‌కి చాలా దగ్గర. అహ్మదాబాద్‌కి 187 కిమీ దూరాన ఉంది. ఢిల్లీ, ఆగ్రా, జోధ్‌పూర్ నుండి రైలు మార్గాలు మౌంట్ అబుకి 27 కిమీ దూరం వరకు ఉన్నాయి. అక్కడి నుండి గంట సేపు బస్సు ప్రయాణం.

ఇక్కడ వేసవి కాలంలో సందర్శకుల తాకిడి ఎక్కువ. కాబట్టి ఉండటానికి వసతులు ముందుగానే బుక్ చేసుకోవడం మంచిది.

బండ రాళ్ళు, ఇసుక కప్పిన నేల, అక్కడక్కడా ఉండీ ఉండనట్టుండే చెట్లు... ఇటువంటి వాతావరణాన్ని చీల్చుకుంటూ, వంపులు తిరిగిన కొండ మార్గంపై ప్రయాణించి మౌంట్ అబు చేరుకుంటే - స్వర్గం అంటే ఇదే కాబోలు అన్నంత అద్భుతంగా అనిపిస్తుంది. ❄



వీరి వీరి గుమ్మడి పండు

వీరి పేరేమి?

ఈ ఫొటో ఓ బాలీవుడ్ హీరోది. జవాబు తెలియాలంటే 21వ పేజీ చూడండి.

తెర

ఈ వ్యాసాలను పరిశీలిస్తుంటే మహేంద్ర దేవ్ కేవలం అంకెలు చెప్పే ఆర్థిక వేత్తగానే గాక సామాజిక న్యాయం కోసం పరితపించే సామాజిక శాస్త్రజ్ఞుడిగానూ కనిపిస్తారు. 'సమతుల అభివృద్ధికి మార్గమేది?',' వృద్ధిరేటు ఏం ఉద్ధరించింది?'సమశ్రుతి లేని సామాజిక ప్రగతి','సమతూకం లోపించిన సమానత్వం',' పేదలకు మేలు చేసే సంస్కరణలే ప్రధానం', 'సామాన్యుడు సంతోషంగా లేడు', 'అభివృద్ధి ఫలాలు అందరికీ అందేదెలా?', దిశే మారలేదు, దశ మారేదెలా?' ఇలాటి వ్యాసాల శీర్షికలే ఆయన ఆలోచనా ధోరణిని తెలియజేస్తాయి.వీటన్నిటిలోనూ రచయిత అభివృద్ధి ఫలాలు పేదలకు అందకపోతే ఎన్ని చెప్పుకున్నా నిష్ఫలమని తేల్చి చెబుతారు.'ధాన్యం బస్తాల నడుమ జనం పస్తులు' వ్యాసం ఇప్పుడు చర్చలో వున్న ఆహార అభద్రత సమస్యకు చక్కగా సరిపోతుంది. అసంఘటిత రంగంలో సమస్యలను మరో రెండు వ్యాసాలలో చర్చించారు.



అభివృద్ధి జపమూ అట్టడుగు జనమూ....

తాను చేపట్టిన సంస్కరణల వల్లనే ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి చెందిందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికీ గొప్పగా ప్రకటించుకుంటున్నారు. కాదు మా విధానాల కారణంగానే శరవేగంతో పురోగమిస్తున్నామని ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖరరెడ్డి ప్రచారం చేసుకుంటున్నారు.

ఇంతకూ నిజంగా ఈ రాష్ట్రం అభివృద్ధి చెందిందా? దాని గురించి అంతగా మురిసిపోవలసిన అవసరం వుందా? ఒక వేళ అభివృద్ధి నిజమైతే అందుకు కారణాలేమిటి? అన్నిటికన్నా ప్రధానమైన ప్రశ్న- దాని ఫలాలు ఎవరికి చేరాయి? ఈ ప్రశ్నలకు రాజకీయ కోణం నుంచి గాక ఆర్థిక గణాంకాల ప్రాతిపదికగా విశ్లేషించడం చాలా ముఖ్యం. ప్రసిద్ధ ఆర్థిక వేత్త, ఇటీవలనే కేంద్ర ధరల నిర్ణాయక సంఘాధ్యక్షుడుగా నియమితుడైన డా. మహేంద్ర దేవ్ రాష్ట్రాభివృద్ధిపై వివిధ కోణాల నుంచి చేసిన విలువైన విశ్లేషణల సమాహారం 'అభివృద్ధి-పేదరికం'.

సమాచార సమృద్ధంగానూ, సంఖ్యా సముచ్చయంగానూ వున్న ఈ పుస్తకం ఆర్థిక రంగ నిపుణులకే గాక మామూలు పాఠకులకు కూడా ఆ విషయాలు సులభశైలిలో అందిస్తుంది.

'ఆంధ్రప్రదేశ్ స్థూల ఆర్థిక దృశ్యం" అన్న అధ్యాయంతో పుస్తకం మొదలవుతుంది. ఉన్నవాటిలో ఇదే పెద్ద అధ్యాయం.34 పేజీలున్న ఈ పుస్తకంలో రచయిత రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పేదరికం, అసమానతలు, సామాజిక రంగాల పరిస్థితి వంటి అంశాలను సవివరంగా పరిశీలించారు. 1980లలో అభివృద్ధిలో ముందున్న ఆంధ్రప్రదేశ్ 90లలో బాగా పడిపోయింది. 1993-94 నుంచి 2003-04 మధ్య కాలంలో 18 పెద్ద రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ స్థూల ఉత్పత్తిలో ఏడవ స్థానంలోనూ, తలసరి స్థూల ఉత్పత్తిలో అయిదవ స్థానంలోనూ వుంది. మొత్తం తలసరి ఆదాయంలో వ్యవసాయం కన్నా ఇతర రంగాల వాటా పెరుగుతూ వస్తోంది. వ్యవసాయంలో తలసరి ఆదాయం పెరుగుదల నామమాత్రంగానే వుంది.వ్యవసాయ రంగంలో అభివృద్ధి జరిగిన మేరకు కూడా శ్రామికులకు ఉపాధి కల్పించేదిగా లేదు అని ఆయన నిర్ధారించారు. ఆంధ్ర ప్రదేశ్ ఐటి రంగంలో అభివృద్ధి సాధించినప్పటికీ ఇది హైదరాబాదుకే పరిమితమై పోయింది.

ఇక ప్రధానంగా ప్రాంతీయ అసమానతలను తగ్గించడంలో ఫలితాలు ఏమాత్రం సంతృప్తికరంగా లేవని మహేంద్రదేవ్ స్పష్టంగా చెబుతారు.ఇందుకు సంబంధించిన లెక్కలు కూడా ఇచ్చారు.రాష్ట్రంలో అతిపేదవైన నాలుగు జిల్లాలు- శ్రీకాకుళం, వరంగల్, మహబూబ్‌నగర్,విజయనగరంల తలసరి సగటు ఆదాయం అతి సంపన్నమైన రంగారెడ్డి, మెదక్, నెల్లూరు, కృష్ణా జిల్లాల తలసరి సగటు ఆదాయంలో 57.4 శాతం నుంచి 65.5 శాతానికి మాత్రమే పెరిగింది. కొన్ని జిల్లాల్లో అధిక అభివృద్ధి రేటు కనిపించినా అది అంతకు ముందు అవి మరీ అధ్వాన్నంగా వుండటం వల్ల కలిగిన పరిణామమని ఆయన స్పష్టీకరించారు. అదే విధంగా నాణ్యత కోణం నుంచి చూస్తే కొన్ని తెలంగాణా జిల్లాల్లో అభివృద్ధి లెక్కలు పెద్దగా అక్కరకు రావని కూడా ఆయన స్పష్టం చేశారు.ఇరిగేషన్ సదుపాయాలు అధికంగా వున్న దక్షిణ కోస్తాలోనూ, ఉత్తర తెలంగాణాలోనూ, ఉత్తర కోస్తాలోనూ, హెక్టారుకు సగటు ఉత్పత్తి అధికంగా వుంటే రాయలసీమ,దక్షిణ తెలంగాణాలలో ఉత్పాదకత తక్కువగా వుంది. మౌలిక సదుపాయాల రంగంలోనూ రాష్ట్ర పరిస్థితి ఏమంత సంతృప్తికరంగా లేదు.పేదరికం విషయానికొస్తే గ్రామీణ ప్రాంతాలలో కన్నా పట్టణ ప్రాంతాలలో అధికంగా వుంది.

'రాష్ట్రాభివృద్ధి లక్ష్యాల సాధనపై సందేహాలు' అన్న రెండవ వ్యాసంలో మహేంద్రదేవ్ రానున్న దశాబ్దంలో ఆర్థిక మానవాభివృద్ధి సాధించడానికి ఎలాంటి వ్యూహం అనుసరించాలన్న అంశం చర్చించారు. విద్యారంగం వెనకబాటు గురించి ప్రస్తావించారు. కేవలం ఆర్థిక కోణం నుంచే కాక సాంఘిక రాజకీయ వాస్తవికతల మీద ఆధారపడి అర్థవంతమైన సంస్కరణలు అమలు జరపాలని సూచించారు. అక్షరాస్యతలో 26వ ర్యాంకులో, శిశు మరణాలలో 23వ ర్యాంకులో వుండటం సిగ్గు పడవలసిన విషయం. 'స్వర్ణమయ ప్రగతి సాధించగలిగామా?' అన్న వ్యాసంలో ఆయన ఈ అంశాలను నొక్కి చెప్పడంతో పాటు భవిష్యత్తులో ప్రగతి సాధించాలంటే ఆరు అంశాలపై కేంద్రీకరించాలని సూచించారు. ప్రస్తుత ప్రభుత్వం నీటిపారుదలపై కేంద్రీకరించడం సరైందని చెబుతూనే వ్యవసాయ పారిశ్రామిక ఉత్పత్తుల రంగాన్ని అభివృద్ధి చేయడం కీలకమని

పేర్కొన్నారు. నిరుద్యోగాన్ని తగ్గించడం మూడోది. విద్య, వైద్యం వంటి సామాజిక రంగాల ద్వారా పేద ప్రజలకు సేవలను విస్తరింపచేయడం నాల్గవది. ప్రాంతీయ అసమానతల తొలగింపు అయిదవది. నిధులు విధుల అధికార వికేంద్రీకరణ ఆరవ ముఖ్యమైన అంశం. ఇప్పుడు అభివృద్ధి గురించి పాలకులు గొప్పగా చెప్పుకుంటున్న విషయాలను ఈ కొలబద్దలతో పరిశీలిస్తే అసలు సంగతి తెలిసిపోతుంది. 'యాభై ఏళ్లకి ఇదిగో ఇలా' అన్న వ్యాసంలోనూ ఆయన రాష్ట్రంలో వివిధ రంగాల స్థితిగతులను పరామర్శించారు. 2000 లో న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సహస్రాబ్ది సదస్సులో 18 దేశాల ప్రతినిధులు విశ్వ మానవాళికి భద్రమైన భవిత అందించాలంటే ఏం చేయాలో ఒక పత్రం విడుదల చేశారు.ఆ ప్రకారం చూసినప్పుడు భారత దేశం ఎలా వుందో "అభివృద్ధి లక్ష్యాల సాధనలో మనమెక్కడ?' అన్న వ్యాసంలో విశ్లేషించారు.

ఈ వ్యాసాలను పరిశీలిస్తుంటే మహేంద్ర దేవ్ కేవలం అంకెలు చెప్పే ఆర్థిక వేత్తగానే గాక సామాజిక న్యాయం కోసం పరితపించే సామాజిక శాస్త్రజ్ఞుడుగానూ కనిపిస్తారు. 'సమతుల అభివృద్ధికి మార్గమేది?',' వృద్ధిరేటు ఏం ఉద్ధరించింది?'సమశ్రుతి లేని సామాజిక ప్రగతి','సమతూకం లోపించిన సమానత్వం',' పేదలకు మేలు చేసే సంస్కరణలే ప్రధానం', 'సామాన్యుడు సంతోషంగా లేడు', 'అభివృద్ధి ఫలాలు అందరికీ అందేదెలా?', దిశే మారలేదు, దశ మారేదెలా?' ఇలాంటి వ్యాసాల శీర్షికలే ఆయన ఆలోచనా ధోరణిని తెలియజేస్తాయి.వీటన్నిటిలోనూ రచయిత అభివృద్ధి ఫలాలు పేదలకు అందకపోతే ఎన్ని చెప్పుకున్నా నిష్ఫలమని తేల్చి చెబుతారు.'ధాన్యం బస్తాల నడుమ జనం పస్తులు' వ్యాసం ఇప్పుడు చర్చలో వున్న ఆహార అభద్రత సమస్యకు చక్కగా సరిపోతుంది. అసంఘటిత రంగంలో సమస్యలను మరో రెండు వ్యాసాలలో చర్చించారు. ఉపాధి మెరుగుదలకు మార్గాలు సూచించేవీ వున్నాయి. వ్యవసాయరంగం వెనకబాటును విశ్లేషించిన వ్యాసాలు కూడా విలువైనవే. వీటిలో కొన్ని జాతీయ దృశ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాసినవి. ఆర్థిక రంగంలో యుపిఎ ప్రభుత్వ పాలన తీరుపై ఒక వ్యాసం వుంది. అధికార వికేంద్రీకరణను నొక్కి చెప్పిన వ్యాసం, సమాచార హక్కు పటిష్టతపై రాసింది కూడా వున్నాయి.

ఇవన్నీ గాక 'చైనా ప్రగతి చెబుతున్న దేమిటి? అన్న వ్యాసంలో ఆయన 1950లో మనతో సమాన స్థితిలో వున్న చైనా ఇప్పుడు దూసుకుపోయిన వైనాన్ని అంకెలలో తెలిపారు.అందుకు కారణాలను చెప్పారు.భూ సంస్కరణలు చేపట్టడం, మౌలిక రంగానికి విద్యా వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనివ్వడం, దేశీయ పరిస్థితులకు తగిన ప్రాథమ్యాలు నిర్ణయించుకుని సంస్కరణలు చేపట్టడం ఇందుకు కారణమన్నారు.

మొత్తంపైన ప్రపంచబ్యాంకు అడుగు జాడల్లో నడవడం గాక తమ దేశాభివృద్ధికి మార్గం తామే నిర్ణయించుకోవాలని, అది కూడా ప్రజలందరి అభివృద్ధిగా వుండాలనీ ఈ పుస్తక సారాంశంతో తప్పక ఏకీభవించవలసిందే.

అభివృద్ధి పేదరికం
(వ్యాసాల సంకలనం)
ఎస్. మహేంద్రదేవ్
వెల:50/-, పేజీలు: 150,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.







సీరియల్

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

జరిగిన కథ:

జూలై 28 నాటికి వుదయం, లుకింగ్ గ్లాస్, కొందర్ని వెంట తీసుకొని కాన్యన్ దాటటానికి సన్నాహాలు చేస్తున్నాడు. పశువులమందల్నీ, స్త్రీలను, పిల్లల్నీ పర్వతాలవైపు తరలించాడు జోసెఫ్. ఇది గమనించి, కెప్టెన్ రాన్ వీళ్లను నిరోధించటానికి ప్రయత్నించాడు గాని ఇప్పుడు ఆటంకాలు కలిగిస్తే పూర్తిస్థాయి యుద్ధంగా మారే అవకాశముందని గ్రహించి తన ప్రయత్నం విరమించుకున్నాడు.

షెర్మాన్

అమెరికన్ దేగ

(53వ భాగం)

ఆగస్టు 9 నాటి రాత్రి కల్నల్ గిబ్బన్ స్థానిక వలంటీర్లు, అశ్వికులతో కలిసి వచ్చి ఒక కొండ చాటుగా నక్కి బిగ్‌హోల్ రివర్ వద్ద క్యాంపు చేసిన నెజ్‌పెర్స్ మీద దాడికి సన్నాహాలు చేసుకున్నాడు. మరునాటి ఉదయం, యుద్ధానికి బయల్దేరటానికి ముందు "ఇండియన్లను ఖైదీలుగా పట్టుకోవలసిన అవసరముందా?" అని గిబ్బన్‌ను అడిగారు వలంటీర్లు. స్త్రీలు, పిల్లలైనా సరే బందీలు చెయ్యవలసిన అవసరం లేదన్నాడు కల్నల్!

చల్లటి గాలికి గజగజా వణికిన సైనికులు వెచ్చదనం కోసం విస్కీ తాగారు. తెల్లవారి, కాస్త పొద్దెక్కిన తర్వాత గిబ్బన్‌ను ఎటాక్ చెయ్యమని ఆదేశాలిచ్చాడు. కాని చాలా మందికి మందెక్కువైంది. పదాతి దళం ముందుగా రైఫిళ్లలో నెజ్‌పెర్స్ గుడారాల మీద గుళ్ల వర్షం కురిపించింది.

ఒక గుడారంలో నిద్రిస్తున్న పదిహేనేళ్ల కౌటోలిక్స్ తుపాకి చప్పుడు విని "నిద్రిస్తున్న వాళ్లను లేపి, ఆత్మ రక్షణ కోసం వంగి నేల మీద పాకుతూ ఆయుధాల కోసం వెదికాడు. ఒక వృద్ధ స్త్రీ పాట్సికోమ్ని కూడా కుర్రాణ్ణి అనుకరించింది. మొదట ఒక బులెట్ ఆమెకు చాతీలో తగిలింది. కౌటోలిక్స్ ప్రాణభయంతో పరిగెత్తాడు. ఆ తర్వాత, కొద్ది నిమిషాల్లోనే పిల్లలు, స్త్రీలు అనే తేడా లేకుండా అందరూ నేలకొరిగారు.

మరో యువకుడు బ్లాక్ ఈగిల్, తనను తాను రక్షించుకునే ప్రయత్నంలో నదిలోకి దూకాడు కాని మంచులాంటి నీటిలో వుండలేక పైకి వచ్చి ఒక గుర్రమెక్కి కొండల్లోకి పారిపోయాడు.

ఈలోగా, మెరుపుదాడి గురించి తెలుసుకున్న మిగతా ఇండియన్లు వైట్‌బర్డ్ నాయకత్వంలో ఎదురు దాడికి సిద్ధపడ్డారు. యుద్ధంలో పాల్గొనని జోసెఫ్, స్త్రీలనూ, వృద్ధుల్ని, పిల్లల్ని సురక్షిత ప్రాంతానికి తరలించాడు. "ఫైర్! ఘూట్!" అంటూ వైట్‌బర్డ్ తన అనుయాయుల్ని వుత్సాహపరిచాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం సుశిక్షితులైన గిబ్బన్ సైనికులకన్న నెజ్‌పెర్స్ యువకులే బాగా యద్ధం చేశారట. ఒకసారి కూడా వాళ్ళ గురి తప్పలేదు. "తాగుడెక్కువైన తెల్లవాళ్ళ శరీరాలు స్వాధీనం తప్పాయి. కొందరు తాగుతూనే మరణించారు" అని చెప్పాడు ఎల్లో వూల్ఫ్.

సైనికులు, హోవిట్జర్ శతఘ్నిని పేల్చటానికి ప్రయత్నించినప్పుడు నెజ్‌పెర్స్ దాని మీదా దాడిచేసి ధ్వంసం చేశారు. కల్నల్ గిబ్బన్ కుంటుతూ నడుస్తాడు (అప్పటికే ఒక యుద్ధంలో కాలికి గాయమైంది). ఆ రోజు పోరాటంలో ఇండియన్లు పేల్చిన బులెట్ రెండో కాలిలో తగిలింది (నెజ్‌పెర్స్ అతణ్ణి "వన్ హూ లింప్స్ ట్వైస్" అని పిలిచారు). యుద్ధం సాయంత్రం దాకా కొనసాగింది. కనీసం ముప్ఫై మంది సైనికులు మరణించారు. మరో నలభై మంది తీవ్రంగా గాయపడ్డారు. నెజ్‌పెర్స్ వైపు ఎనభై మంది నేలకొరిగారు. అందులో ఎక్కువ మంది స్త్రీలు, పిల్లల శరీరాలను బుల్లెట్లు జల్లెడ లాగ ఛిద్రం చేశాయి. కొస ప్రాణంతో వున్న వాళ్లను సైనికులు బూటు మడిమలతో, రైఫిల్ బులెట్స్‌తో కొట్టి చంపారు.

ఇండియన్లు అదనపు బలగాలతో హోవర్డ్ చేరుకుని వుండకపోతే ఆనాడు గిబ్బన్ దళం తుడిచిపెట్టుకుపోయేదే. ప్రమాదం పసిగట్టిన నెజ్‌పెర్స్ వార్తాహరులు, జోసెఫ్‌ను వీలైనంత త్వరగా పారిపొమ్మని చెప్పారు.

"పరిగెత్తటంలో మేం వాళ్లతో పోటీ పడలేం. ఆరు రోజుల తర్వాత జనరల్ హోవర్డ్ సైన్యం మమ్మల్ని సమీపించింది. ఒక యుద్ధం చేయక తప్పలేదు. కొంత నష్టం జరిగినా, మొత్తం మీద సమీపించిన పశువుల మందల్నీ, కంచర గాడిదల్నీ స్వాధీనం చేసుకోగలిగాం" అంటూ ఆనాటి ఘటనల్ని గుర్తు చేసుకున్నాడు జోసెఫ్. అన్ని ఆటంకాలనూ అధిగమించి, ఆగస్టు 22 నాడు ఇండియన్లు టార్గీ కనుమ దాటి ఎల్లోస్టోన్ పార్క్‌లో ప్రవేశించారు.

ఐదు సంవత్సరాల క్రితమే, వాషింగ్టన్‌లోని ప్రభుత్వం, ఎల్లో స్టోన్ ప్రాంతాన్ని జాతీయ పార్క్‌గా ప్రకటించింది. 1877 వేసవి కాలంలో, కొందరు పర్యాటకులు దర్శించటంతో దాని గురించి అమెరికా అంతటా ప్రచారం కూడా జరిగింది. అలా వచ్చిన తొలి పర్యాటకుల్లో

జనరల్ షెర్మాన్ ఒకడు (కేవలం మూడు వందల మంది నెజ్‌పెర్స్ - స్త్రీలు, పిల్లలు బాధ్యతలు కూడా మోస్తున్న ఈ యువకులు - తమకన్నా అయిదారు రెట్లు ఎక్కువ సంఖ్యాబలమున్న సైన్యం కళ్ళు గప్పి పార్కులో ప్రవేశించటం వాళ్ళ యుద్ధ చతురతకు నిదర్శనం అని ప్రశంసించాడు).

హోవర్డ్, గిబ్బన్‌లిద్దరూ నిలువరించలేక పోయిన ఇండియన్లను ట్రాప్ చెయ్యటానికి మరి కొంత మందిని నియమించాడు షెర్మాన్. లిటిల్ బిగ్‌హార్న్ సంఘటన తర్వాత కస్టర్ దళం (సెవెంత్ కవల్రీ) తన అధీనంలోకి వచ్చింది. ఇప్పుడా అశ్వికులందరూ పారిపోతున్న నెజ్‌పెర్స్‌ను జంతువుల్లా వేటాడారు. సెప్టెంబర్ నెలలో, ఇరు పక్షాలూ దొరికిన వాళ్ళను దొరికినట్టే చంపుకున్నాయి. చివరికి, కాన్యన్ క్రీక్ వద్ద సైనికులను మరోసారి తప్పించుకుని కెనడా వైపు కదిలారు. ఇండియన్లు షెర్మాన్ అప్పటికే, ఫోర్ట్ కియెగ్ నుండి బేర్ కోట్‌మైల్స్ ను సైన్యాలతో పంపించాడన్న విషయం వాళ్లకు తెలియదు.

సెప్టెంబర్ 23 నాడు కౌ ఐలాండ్ లాండింగ్ వద్ద క్షేమంగా మిస్సోరి నది దాటారు నెజ్‌పెర్స్. ఎక్కడా సైనికుల జాడలేదు. 29 నాడు ఒక అడవి దున్నల మందను చూసిన యువకులు కోరికను చంపుకోలేక అక్కడే క్యాంప్ చేస్తామన్నారు. ఆకలిగా వున్నది. ఈ జంతువులతో కొన్నాళ్ళు కడుపు నిండుతుంది. బేర్ పా మౌంటెన్స్‌లో గుడారాలు వేసుకున్నారు. కెనడా చేరటానికి ఇక ఒకటి రెండు రోజుల ప్రయాణమే మిగిలింది.

"జనరల్ హోవర్డ్ మమ్మల్ని చేరటానికి కనీసం మూడు రోజులు పడుతుంది" అని ధీమా వ్యక్తం చేశాడు ఎల్లో వూల్ఫ్.

అయితే, మరుసటి వుదయమే, సమీపంలో సైనికులు కనిపించారంటూ సమాచారమందించారు కొందరు యువకులు. అందరూ హడావిడిగా ప్రయాణానికి సన్నాహాలు చేసుకొనేలోగానే డ్యూటీ చేస్తున్న సెంట్రీలు బ్లాంకెట్ సిగ్నల్ చూపి "సైన్యం వచ్చేసింది" అంటూ అరిచారు.

బేర్ కోట్‌మైల్స్ నాయకత్వంలో వచ్చిన అశ్విక దళమది. తెల్లవాళ్లకు అమ్ముడు పోయిన కొందరు సియో, షెయెనీలు (సుమారు ముప్పై మంది) సైన్యానికి దారి చూపించారు.

- సైనిక యూనిఫాంలు కానుకగా ఇస్తామని ఆశపెట్టి ఫోర్ట్ రాబిన్సన్ వద్ద తెల్లవాళ్ళు వీళ్లను లొంగదీసుకున్నారు. తరువాతి రోజుల్లో ఇలాంటి . కిరాయి మూకల చర్యలే క్రేజీహార్స్ హత్యకు దారి తీశాయి.

మెరుపులా వచ్చిన ఆరు వందల గుర్రాల పద ఘట్టనలతో భూమి కంపించింది. అయినా, మొక్కవోని ధైర్యంతో వైట్‌బర్డ్ క్యాంప్ వెలుపలే శత్రువులను ఎదుర్కొన్నాడు. సైనికులకు గురి చూసి కాల్చటం అలవాటు లేదు. నెజ్‌పెర్స్‌కు గురి తప్పదు. వీళ్ళ బుల్లెట్ ఒక్కటి కూడా వృధా కాలేదు. మొదటి ఆరు గంటల్లోనే ఇరవైనాలుగు మంది తెల్లవాళ్ళు హతులయ్యారు. మరో నలభై

వైట్ బర్డ్

"తన గురించి నాకు బాగానే తెలుసని జనరల్ హోవర్డ్‌కు చెప్పండి. అతడు చేసిన వాగ్దానాలను నేనింకా మరచిపోలేదు. జీవితమంతా యుద్ధంచేసి అలసిపోయాను. నా యోధులు నేలకొరిగారు. లుకింగ్ గ్లాస్ ఇప్పుడు లేడు. టూహూల్‌హూ మా కోసమే మరణించాడు. మా తెగ పెద్దలెవరూ సజీవంగా మిగల్లేదు. అందువల్ల, యువకుల ఇష్టానుసారమే ఇదంతా జరిగింది. యువకుల నాయకుడు ఆలోకాట్ వీరమరణానికీ మేమంతా సాక్షులమే. చలి ఎముకలు కొరికేస్తున్నది. కప్పుకోవటానికి బ్లాంకెట్లు లేవు. చంటి పిల్లలు, మంచు గాలిలో వూపిరి తీసుకోలేక చచ్చిపోతున్నారు. ఈ ఇక్కట్లను భరించలేని కొందరు ఇప్పటికే కొండల్లో తలదాచుకుంటున్నారు. భోజనం బ్లాంకెట్లు లేవు. మృత్యువు పలకరిస్తున్నది. మంచు దుప్పట్ల కింద దానితోనే సహజీవనం చేస్తున్నాం. కొండల్లోకి పారిపోయిన వాళ్లు కూడా చలికి గడ్డకట్టుకుపోయే వుంటారు.

రెండు మంది గాయపడ్డారు. ఇతరులు భయంతో గుర్రాలపై నుండి దూకి దౌడు తీశారు.

"మాకు వాళ్ళకూ మధ్య ఇరవై రెండు అడుగుల దూరం మాత్రమే వుంది. ఎదురెదురుగా నిలబడి పోరాడాం. మరణించిన సైనికులను తీసుకుపోవటానికి కూడా వాళ్లు సాహసించలేకపోయారు. ఆయుధాలు కూడా వదిలి వెళ్ళారు. మొదటి రోజు యుద్ధంలో మేం పద్దెనిమిది మంది యోధుల్నీ, ముగ్గురు స్త్రీలనూ పోగొట్టుకున్నాం" అన్నాడు జోసెఫ్. ఆ రోజు నేల కొరిగిన వాళ్ళలో జోసెఫ్ సోదరుడు ఆలోకాట్, టూ హూల్ హూల్ జోట్ ముఖ్యులు.

చీకటి చాటున ఉత్తర దిశగా పారిపోవటానికి ప్రయత్నించారు నెజ్‌పెర్స్. కాని బేర్‌కోట్ సరిహద్దు వద్ద సైనికుల్ని గస్తీ పెట్టాడు. అంటే మరో రోజు యుద్ధం తప్పదు. రాత్రంతా అగడ్తలు తీసుకుంటూ గడిపారు యోధులు.

అయితే, మరునాడు, పోరాటానికి బదులు, తెల్ల జెండాతో దూతను పంపాడు బేర్‌కోట్. జోసెఫ్ లొంగి పోతే, నెజ్‌పెర్స్‌కు హాని తల పెట్టబోమని హామీ కూడా ఇచ్చారు. ఆలోచిస్తానన్నాడు జోసెఫ్.

మంచు తుఫాను వచ్చే సూచనలు కనిపించాయి. అదే గనక వస్తే, సైనికులు యుద్ధం చెయ్యలేరు. తాము అదే రక్షణ కవచంగా కెనడాలోకి పారిపోవచ్చు.

మధ్యాహ్నం వరకు, యుద్ధం విరమించుకోవాలంటూ జనరల్ మైల్స్ మరో సందేశం పంపించాడు. "ఆ పెద్ద మనిషి అబద్ధమాడాడనుకుని నేను చర్చల కోసం ఆయన టెంట్‌కు వెళ్లాను" అన్నాడు జోసెఫ్.

అయితే, నయవంచన, వాగ్దాన భంగం తెల్లవాళ్ళ స్వభావంలోనే వుంది. జోసెఫ్‌ను బందీ చేసి, నెజ్‌పెర్స్ మీద తను దాడి కొనసాగించారు. ఖైదులో కూడా లొంగిపోవటానికి నిరాకరించాడు జోసెఫ్. రెండు రోజుల పాటు తీవ్రమైన మంచు గాలులు వీచి సైనికులు క్యాంపు విడిచి కదలలేకపోయారు.

మూడవ రోజు, నెజ్‌పెర్స్ యోధులు దాడిచేసి, జోసెఫ్‌ను విడిపించుకున్నారు (మైల్స్ అధికారి నొకణ్ణి పట్టుకుని, జోసెఫ్‌ను వదలక పోతే వాణ్ణి చంపుతామని బెదిరించారు). సాయంత్రం వరకు, జనరల్ హోవర్డ్ తన సైనికులతో కదలి వచ్చి మైల్స్‌కు అదనపు బలం చేకూర్చారు.

తనకున్న కొద్ది మంది యోధులతో యుద్ధం కొనసాగించలేనని గ్రహించాడు జోసెఫ్. లొంగిపోవటం తప్ప గత్యంతరం లేదు. ఆయుధాలు వదిలెయ్యండి. మిమ్మల్ని క్షేమంగా రిజర్వేషన్‌కు చేర్చే పూచీ నాది" అది మైల్స్ చివరి సందేశం.

చివరిసారిగా, జోసెఫ్ తన అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాడు. ప్రాణం పోయినా సరే, లొంగుబాటుకు అంగీకరించమన్నారు లుకింగ్ గ్లాస్, వైట్ బర్డ్. స్వేచ్ఛ కోసం, ఎన్నో కష్టాలకోర్చి, ఎన్నో యుద్ధాలు చేసి, పదమూడు వందల మైళ్ళు నడచి ఇందాక వచ్చారు. ఇప్పుడెందుకు లొంగిపోవటం? జోసెఫ్ తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నాడు. ఆ మధ్యాహ్నం జరిగిన పోరాటంలో, నుదుటికి తగిలిన బులెట్‌తో లుకింగ్ గ్లాస్ మరణించాడు.

యుద్ధం కొనసాగింది. "ఐదవ రోజున వెళ్ళి జనరల్ మైల్స్ ముందు తుపాకీ కింద పడేశాను" అంటూ గుర్తు చేసుకున్నాడు జోసెఫ్. ఆ సందర్భంగా అతడిచ్చిన వాంగ్మూలాన్ని, ఇంగ్లీషు అనువాదంలో లెఫ్టినెంట్ చార్ల్స్ ఎర్స్కైన్ స్కాట్ వూడ్ (తరువాతి కాలంలో వూడ్ న్యాయవాద వృత్తి చేపట్టాడు. జోసెఫ్, నెజ్‌పెర్స్‌ల పరిచయం అతణ్ణి బాగా ప్రభావితం చేసింది. ఇండియన్ల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం వుద్యమం చేపట్టి, రచయితగా, కవిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు) ఇలా రికార్డు చేశారు. అమెరికన్ ఇండియన్లిచ్చిన వుపన్యాసాల్లో దీనికో ప్రత్యేక గుర్తింపు వుంది.

శ్రీకాకుళం

దర్శక
మణిరత్నం గురించి కొత్తగా
చెబితే వింతగా ఉంటుంది. ఆయన పనితనం ఎలాంటిదన్నది ఆయన చిత్రాలే చెబుతాయి. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. అనిల్ కపూర్ హీరోగా నటించిన 'పల్లవి అనుపల్లవి' అనే కన్నడ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమయ్యారు. తొలి చిత్రం నిరాశ పరిచింది. ఆపై మలయాళంలో, తమిళంలో చిత్రాలు తీశారు. ఆడలేదు. దర్శకునిగా హ్యాట్రిక్ ఫ్లాప్ చవిచూశారు. ధైర్యం సడలిపోలేదు. సినిమానే నమ్ముకున్నారు. 'మౌనరాగం'తో హిట్ కొట్టారు. ఆపై వచ్చిన 'ఘర్షణ', 'నాయకుడు', 'దళపతి', 'రోజా'... ఎన్నో మైలు రాళ్ళను సొంతం చేసుకున్నారు. వీటిలో కొన్నిటి గురించి ఆయన మాటల్లోనే...



ఈ లక్షణాలు నాకు కలిసొచ్చాయి

నాయకుడు...

ఔట్ లైన్‌గా అనుకున్న కథను ఓ నిర్మాతకు చెప్పాను. దర్శకత్వం చేపట్టే అవకాశం రావడంతో పూర్తి స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నాను. ముంబాయిలో నివాసముంటున్న వరదరాజన్ ముదలియార్ నిజ జీవితాన్ని కథగా రాసుకున్నాను. చిత్ర కథానాయకుడు కమల్‌హాసన్‌కూ సాన్నిహిత్యముంది. దీంతో వరదరాజన్‌కు చిత్రాన్ని చూపించాం. తన సెక్యూరిటీతో చూడడానికి వచ్చారు. వీళ్ళంతా ఎవరని అడిగితే ఫ్రెండ్స్ అన్నారు. సినిమా విడుదలకు ఒక రోజు ముందు కమల్ ఈ చిత్రాన్ని చూశారు. నాకు తెలియని ఓ విషయాన్ని చెప్పారు. తాను సినిమాల్లో చూపించినంత మంచివాణ్ణి కాదన్నారు.

దిల్ సే...

ఈ చిత్రానికి ముందు షారూక్ ఖాన్ నటించిన సినిమాలు పెద్దగా చూడలేదు. షారూక్ సామాన్యుడిలా కనబడతాడు. కథకు ఈ తరహా లక్షణాలు అవసరం. సరిగ్గా ఈ పాత్రకు అతనైతేనే బాగుంటాడనిపించింది.

రోజా...

అరవిందస్వామి, మధుబాల జంటగా నటించిన 'రోజా' చిత్రం కోసం ఇండియా బోర్డర్ లడక్‌లో షూటింగ్ చేశాం. భౌగోళికంగా ఆ ప్రదేశం కథకు సరిపోదని తెలిసినా అక్కడే తీయాలనుకున్నాం. ప్రభుత్వం నుంచి పూర్తి స్వేచ్ఛ రావడంతో సినిమా చిత్రీకరణ పెద్ద కష్టమనిపించ లేదు.

అమృత...

గత 20 ఏళ్ళగా తమిళ సాహిత్యం శ్రీలంక నుంచి చెన్నయ్‌కు దిగుమతవుతోంది. ఓ మ్యాగజైన్‌లో దత్తత తీసుకున్న శ్రీలంక అమ్మాయి కథ చదివాను. దీన్ని డెవలప్ చేసి 'అమృత' కథ తయారు చేశాను. 'దిల్ సే'లో ప్రీతి జింటా పాత్రను సిమ్రాన్ చేయాల్సివుంది. మేకప్ టెస్ట్ కూడా నిర్వహించాం. ఆమె అప్పటికే సౌత్ ఇండియాలో పెద్ద స్టార్. డేట్స్ కుదరక అందులో నటించలేకపోయింది. ఒక వైపు గ్లామర్ పాత్రల్లో నటిస్తున్నా... వైవిధ్యంగా కనిపించాలన్న తాపత్రయం ఆమెలో ఉంది. అందుకే 'అమృత'లో ఇద్దరు పిల్లల తల్లిగా ఎంపిక చేశాం.

యువ...

ఇమేజ్‌ను పక్కనపెట్టి అభిషేక్‌ను ఎంపిక చేశాం. నటీనటులను ఈ కోణంలో ఎంపికచేయడం కొంత రిస్కే. బాడీ లాంగ్వేజ్, భాష, అభినయంపై చాలా వర్కవుట్ చేశాం. చిత్ర కథకు కోల్‌కతా బ్యాక్‌డ్రాప్ ఎందుకు తీసుకున్నానంటే... స్టూడెంట్స్‌లో చైతన్యం, రాజకీయ అవగాహన కల్గిన ప్రదేశం కావాల్సివచ్చింది. కేవలం రెండే రెండు మెట్రోపాలిటన్(ఢిల్లీ, కోల్‌కతా) సిటీల్లో ఈ తరహా లక్షణాలు కన్పిస్తాయి. ముంబాయిలో ఈ ధోరణి కన్పించదు. ముంబాయిలో కూడా షూటింగ్ చేయొచ్చు. కానీ కథకు దగ్గరగా కోల్‌కతాను ఎంచుకున్నాం.

మీ సినిమాల్లో ఫొటోగ్రఫీ బాగుంటుంది. కారణం?

నేను పని చేసిన సినిమాటోగ్రాఫర్లకు కెమెరా పనితనం గురించే కాకుండా.. సినిమా పట్ల అవగాహన కూడా వుంది. వారికి కథ చెప్పగలను. నటీనటుల పెర్‌ఫార్మెన్స్ పట్ల స్పష్టమైన పరిశీలనా దృక్పథం ఉంది. ఈ లక్షణాలు నాకు కలిసొచ్చాయి. అది నా అదృష్టంగా భావిస్తాను. యూనిట్ మొత్తంలో ముఖ్యంగా కెమెరామేన్‌కూ, దర్శకుడికీ అవినాభావ సంబంధం ఉండాలి. కెమెరాలో చూసి ఎలా ఉందో చెప్పే తొలి ప్రేక్షకుడు సినిమాటోగ్రాఫరే.

ప్రకాష్‌రాజ్‌తో మీ అనుబంధం...

'బొంబాయి' చిత్రంలో చిన్న పాత్రలో కనిపించాడు. 'ఇద్దరు'లో ముఖ్య భూమిక పోషించాడు.. మంచి గుర్తింపు వచ్చింది. ఈ చిత్రానికే అతనికి జాతీయ అవార్డు వచ్చింది. పాత్రలో జీవించడానికి చాలా కష్టపడతాడు. ❋

ఆరోగ్యం

డాక్టర్ వేముల శ్రీకాంత్,

కన్సల్టెంట్ న్యూరో ఫిజిషియన్,

మెడిసిటీ హాస్పిటల్స్, హైదరాబాద్, ఫోన్ : 9490115450

మెదడుకు రక్తప్రసరణ జరగకపోతే...



బ్రెయిన్ స్ట్రోక్ ఎప్పుడొస్తుందో కచ్చితంగా చెప్పలేం. ఇది అకస్మాత్తుగా వస్తుంది. చేయి, కాలు పడిపోవచ్చు, మాట పడిపోవచ్చు... ఒక భాగం తిమ్మిరెక్కి మొద్దుబారిపోవచ్చు. ఇవన్నీ వచ్చినప్పుడు స్ట్రోక్‌గా భావించి వెంటనే చికిత్స చేయించుకోవాలి. సిటి స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌తో దీన్ని నిర్ధారించొచ్చు. అయితే దీనికి చికిత్స చేసే ఆసుపత్రులకు వెళ్తేనే ప్రయోజనం వుంటుంది.

శరీరంలోని అవయవాలన్నీ సక్రమంగా పనిచేయాలంటే వాటికి రక్తప్రసరణ అవసరం. రక్తప్రసరణ తప్పితే ఆ భాగం దెబ్బతింటుంది. మెదడులో వివిధ భాగాలుంటాయి. ఒక్కో భాగం ఒక్కో పని చేస్తుంది. ఏ భాగంలో రక్తప్రసరణ లోపిస్తుందో ఆ భాగం పనిచేయదు. దీనినే అక్యూట్ బ్రెయిన్ స్ట్రోక్ అంటారు. మెదడులో మాటకు సంబంధించిన భాగం దెబ్బతింటే మాట పడిపోతుంది. చేతులు, కాళ్లకు సంబంధించిన భాగం అయితే చేతులు, కాళ్లు పడిపోతాయి. చూపుకు చెందినదైతే ఒక వైపే కనిపిస్తుంది, చెవికి చెందినదైతే ఒక వైపే వినిపిస్తుంది, కంటికి సంబంధించింది అయితే ఒకే వస్తువు రెండుగా కనిపిస్తుంది, శరీరం బ్యాలెన్స్ నిర్వహించే భాగం దెబ్బతింటే సరిగా నడవడం రాదు... ఇలా ఈ విధంగా రకరకాల తేడాలొస్తాయి.

అయితే ఈ లక్షణాలు కనిపించినప్పుడు నొప్పి వుండదు. వాటంతటవే పోతాయని భావించి వదిలేస్తే శాశ్వత సమస్య ఏర్పడొచ్చు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఇలాంటి సమస్యలకు మూడు గంటల్లోనే చికిత్స చేయాలి. మళ్లీ రాకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎవరికొస్తుందంటే....

మధుమేహం, అధిక రక్తపోటు ఉన్న వారికి, రక్తంలో ఎక్కువ కొలెస్ట్రాల్ ఉండే వారికి, సిగరెట్లు ఎక్కువ తాగే వారికి, స్థూలకాయులకు, వ్యాయామం లేని వాళ్లకు...అక్యూట్ బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. ఎందుకంటే వీరిలోని రక్తనాళాలు గట్టిపడతాయి. గుండెలోని రక్తనాళాలు గట్టిపడితే గుండెపోటు, మెదడులోని రక్తనాళాలు గట్టిపడితే బ్రెయిన్ స్ట్రోక్ వస్తాయి.

బ్రెయిన్ స్ట్రోక్ ఎప్పుడొస్తుందో కచ్చితంగా చెప్పలేం. ఇది అకస్మాత్తుగా వస్తుంది. చేయి, కాలు పడిపోవచ్చు, మాట పడిపోవచ్చు... ఒక భాగం తిమ్మిరెక్కి మొద్దుబారిపోవచ్చు. ఇవన్నీ వచ్చినప్పుడు స్ట్రోక్‌గా భావించి వెంటనే చికిత్స చేయించుకోవాలి. సిటి స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌తో దీన్ని నిర్ధారించొచ్చు. అయితే దీనికి చికిత్స చేసే ఆసుపత్రులకు వెళ్తేనే ప్రయోజనం వుంటుంది.

మళ్లీ స్ట్రోక్ రాకుండా వుండాలంటే...

మళ్లీ స్ట్రోక్ రాకుండా మధుమేహాన్ని, అధిక రక్తపోటును నియంత్రించుకోవాలి. రక్తంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవాలి. స్థూలకాయులు బరువు తగ్గాలి. డాక్టర్ సలహా మేరకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. రక్తం గడ్డకట్టకుండా మందులు వాడాలి. ఫిజియోథెరపీ చేయించుకోవాలి. ఇన్‌ఫెక్షన్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

స్ట్రోక్ తర్వాత

అక్యూట్ బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు చికిత్స చేశాక ఉపశమనం కలుగుతుంది. ఆ తర్వాత వీరికి రిహాబిలిటేషన్ అవసరం. ఎందుకంటే...వీరు కొన్ని సమస్యలను ఎదుర్కొంటారు.

- కొందరికి ఆహారం మింగటానికి కష్టమవుతుంది. వీరికి స్వాలో ఆన్ థెరపీ నేర్పిస్తారు. దీంతో ఆహారం తీసుకోవడం కాస్త సులభమవుతుంది. కొంత మందిలో ఇది కూడా పనిచేయదు. వీరికి పైప్ ద్వారా ఆహారం పంపిస్తారు. ఇదీ కాకుంటే నేరుగా జీర్ణాశయంలోకి ట్యూబును వేసి ఆహారమందిస్తారు.
- మాట సరిగ్గా రాని వారికి స్పీచ్ థెరపీ తోడ్పడుతుంది. దీని వల్ల కూడా మాట సరిగ్గా కాకుంటే మ్యూజిక్ థెరపీ ఇస్తారు. దీంతో మాట్లాడడం సులభమవుతుంది.
- మెదడుకు స్ట్రోక్ రావడంతో కొందరికి జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొన్ని పదాలు మాట్లాడడం రాదు, కొన్ని విషయాలు గుర్తుండవు. ప్రత్యేక మందులతో చికిత్స చేస్తారు.

❋



తల మీది పుస్తకం

ఫ్రెండ్స్! ఈ వారం మీకు చెప్పబోయే ఆట ఏంటంటే... 'తల మీది పుస్తకం'. దీని పేరు కూడా తమాషాగా వుందికదూ. కానీ ఆడుతుంటే భలే మజాగా వుంటుందిలే.

ఏమేం కావాలంటే.. వాడేసిన పుస్తకాలు, మీలాంటి పిడుగులు కొంతమంది, పెద్ద వారు ఏవరైనా ఒకరు. మధ్యలో పెద్దవాళ్లెందుకంటారా. మరి మీకు ఆట మొదలెట్టమనీ...ఐదు నిముషాలయ్యాక ఆపమనీ చెప్పాలిగా. అందుకు!

వయస్సు.... 4 నుంచి 6 సంవత్సరాలు

సమయం... ఐదు నిముషాలు

ఎలా ఆడాలంటే... ముందుగా పిల్లలంతా ఒక్కో నోట్ బుక్ తీసుకొని నెత్తి మీద పెట్టుకోవాలి. ఆ తర్వాత అంతా గుండ్రంగా నిలబడాలి. పెద్దవాళ్లు...రెడీ అని చెప్తారు. ఆట మొదలెట్టాలి. అంటే గుండ్రంగా నడవడం మొదలెట్టాలి. నెత్తిమీద పుస్తకాన్ని మాత్రం చేత్తో పట్టుకోకూడదు. బ్యాలెన్స్ చేసుకుంటూ.. నడవాలి మెల్లగా. ఇలా ఐదు నిమిషాల పాటు నడవాలి. అప్పుడు పెద్దవాళ్లు 'స్టాప్' అంటారు. ఆట అయిపోయినట్టు. అయితే ఈ మధ్యలో ఎవరి పుస్తకాలైతే నెత్తిమీద నుంచి కిందపడిపోతాయో వారు ఆటలోంచి బయటికెళ్లిపోవాలి. మిగిలిన ఆటగాళ్లు మళ్లీ ఆడతారు. ఇలా చివరి వరకు ఎవరైతే పుస్తకం కింద పడకుండా నడుస్తారో వారే గెల్చినట్టు.

ఈ ఆట ఆడేవాళ్ల కంటే చూసేవాళ్లకే మజా ఎక్కువగా వస్తుంది. ఎలాగంటారా! తలమీది పుస్తకం ఎక్కడ కిందపడిపోతుందో అని నెమ్మదిగా అప్పడే కోడిగుడ్డులోంచి బయటికొచ్చిన కోడిపిల్లల్లా నడుస్తుంటారు. చూడ్డానికి భలే తమాషాగా వుంటుందిలే. మరి ఆడేస్తారా 'నెత్తి మీది పుస్తకం' ఆట. మరో ఆట గురించి చెప్పకోవాలంటే... ఇంకో వారం రోజులు ఆగాల్సిందే.

సాహిల్

చకచకా... కనిపెట్టాలి!

నేస్తాలూ...ఈ ఫొటో చూశారుగా. ఇందులో 10 బొమ్మలున్నాయి. వాటిని మీరు చకచకా గుర్తించాలి. ఇంతకీ అవేంటనుకుంటున్నారు!
T-shirt, seashell, fish, hammer, sailing ship, artichoke, umbrella, kite, pliers, and lollipop.





A	C	U	P	D	S	T	U
C	U	P	B	O	A	R	D
B	R	O	K	E	S	T	M
P	T	I	B	A	K	W	A
C	A	N	D	L	E	X	T
P	I	N	S	X	M	O	P
A	N	A	M	P	A	M	I

ఆ నాలుగు పదాలు కనిపెట్టాలోచ్

నేస్తాలూ! ఇక్కడ నాలుగు వస్తువులున్నాయి. ఇవి నాలుగూ ఆంగ్ల అక్షరం 'సి'తో మొదలవుతాయి. మరి అవి ఎక్కడున్నాయో గుర్తించి సున్నా చుట్టండే.

(జవాబు: curtain, cup, cupboard, candle)

బాలనేస్తాలు

నక్కను వేటాడేదెట్లా...



కథా నిలయం
శ్రీకాకుళం

ఫ్యామిలీ ఆల్బమ్

తాబేలు: ఫ్యామిలీ ఆల్బమ్ చూపిస్తానంటూ...బ్యాగ్లు, బూటు ఫొటోలు చూపిస్తున్నావేంటి?!

మొసలి: అవును..ఇదే మా ఫ్యామిలీ ఆల్బమ్. వేటగాళ్లు మా అమ్మను ఎత్తికెళ్లి ఇదిగో ఇలా బ్యాగ్ తయారుచేశారు. మా నాన్నను పట్టుకెళ్లి బూటు తయారుచేశారు. మరి నన్ను తీసుకెళ్లి ఏం చేస్తారో ఏంటో!

చిన్నారి చిత్రకారులు

ఎం.రవీందర్, 7వ తరగతి, ప్రాథమికోన్నత పాఠశాల, కంభాలపల్లి, నల్గొండ జిల్లా.



తోట బంటి, 9వ తరగతి, మధు విద్యాలయం, వైరా, ఖమ్మం.

జి. మధు 4వ తరగతి, జడ్.పి. హైస్కూల్, మిధూర్, కర్నూల్,

ఎం. రామాంజనేయులు, 8వ తరగతి, గురుకుల పాఠశాల, ఇబ్రహీంపట్నం.



ఎంకెఆర్

గుడ్డి గుర్రాలకు భారీ దాణా



గుర్రం గుడ్డిదైనా దాణాకు లోటు లేదన్న సామెత తెలుగువారందరికీ తెలిసినదే. అమెరికా వారికి కూడా అది తెలిసినట్లుగా ఉంది. కంపెనీలను దివాలా తీయించిన గుడ్డి గుర్రాల్లాంటి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు (సిఇఓలకు) కళ్లు తిరిగే పరిహారాలిచ్చి సాగనంపటం ఏమిటని నిలదీస్తున్నారు. స్మశానంలో బొగ్గుల నుండి కూడా అమెరికన్ పెట్టుబడిదారులు లాభాలను ఆశిస్తారు. ఇసుక నుండి చమురు తీయటం సాధ్యం కాదంటాం కానీ కంపెనీలను దివాళా తీయించి వాటి నుంచి యజమానులకు లాభాలు సంపాదించి పెట్టటంలో అమెరికన్ కంపెనీల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు (సిఇఓలు) ఎంతో సమర్థులు. సామాన్య కార్మికులకు సగానికి సగం వేతనాల్లో కోత విధిస్తున్న యాజమాన్యాలు సిఇఓల విషయంలో మాత్రం ఎక్కడలేని శ్రద్ధను కనపరుస్తున్నాయి. భారీగా వేతనాలను, అలవెన్సులను పెంచేస్తున్నాయి. అదెలా ఉంటుందో ఈ వారం అట్టమీది కథ. చదవండి మరి.

న్యూయార్క్ నగరంలో బడా వ్యక్తులు సమావేశమయ్యే నక్షత్రాల హోటళ్లలో హిల్టన్ ఒకటి. అక్కడ ఇటీవల ఒక సమావేశం జరిగింది. హోటళ్ళలో సమావేశాలు జరగటం సర్వసాధారణం, ప్రత్యేకత ఏముందంటారా? ఉంది.

ఎందుకంటే...మిగతావారూ పోతారు!

అమెరికాలోని బడా కంపెనీల్లో సిటీ గ్రూపు ఒకటి. దాని వాటాదార్ల సమావేశం రసాభాసగా ముగిసింది. అదే ప్రత్యేకత. అమెరికాలో గత కొద్ది నెలలుగా కొనసాగుతున్న ఆర్థిక సంస్థల పతనం ఎప్పుడు ఆగుతుందో తెలియదు. ఇప్పటి వరకు సిటీ గ్రూపులో 30 బిలియన్ డాలర్ల నష్టాలు బయటపడ్డాయి. ఇంతటి నష్టాలపాలు చేసిన కంపెనీ సిఇవోకు 42 మిలియన్ డాలర్లు నజరానాగా ఇచ్చి పంపటం ఏమిటని సిటీ గ్రూపు వాటాదార్లు డైరెక్టర్లను నిలదీశారు. కంపెనీ కొత్త సిఇవో



ఎగబాకిన వేతనాల రేఖ

అమెరికాలో గడిచిన పది సంవత్సరాలుగా కార్మికుల కనీస వేతనం పెరగలేదు. అది ఇప్పటికీ గంటకు 5.15 డాలర్లుగా ఉంది. అదే సిఇఒల వేతనాలు, అలవెన్సులు మాత్రం ఏడాదికేడాది పెరిగాయి.(డాలర్లలో)

కంపెనీ	సిఇఒ	2005	2006
డెల్	కెవిన్ రోలి	39,314,839	153,223,079
ఫోర్డ్ మోటాం	విలియం ఫోం	7,905,158	19,501,100
టైమ్ వార్నర్	రిచర్డ్ పార్సన్స్	12,668,761	13,095,627

డెల్ కంపెనీ సిఇఓ ఆదాయం మార్షల్ దీవులనే చిన్న దేశం మొత్తం ఆదాయానికి సమానం. ఆ మొత్తంతో ఇప్పుడున్న ధరలతో రానున్న 38 సంవత్సరాల పాటు అమెరికాలోని యువకులందరికీ ఉచితంగా లాప్‌టాప్‌లు కొనివ్వవచ్చు. డెల్ సిఇఒల ఆదాయం పెరిగిన సమయంలో కంపెనీ వాటాల ధరలు పడిపోయాయి.

విక్రమ్ పండిట్ మాత్రం పూర్తిగా సమర్థించుకున్నారు. తీవ్రమైన పోటీ వాతావరణంలో అలా చెల్లించకపోతే మిగిలిన సిబ్బంది కూడా సంస్థ నుంచి వెళ్లిపోయే ప్రమాదం ఉందని అందువలన వారిని నిలుపుకోవాలంటే భారీ మొత్తాలు చెల్లించక తప్పదని చెప్పారు.

అందుకు కారణం అమెరికా విధానమే

ప్రపంచాన్ని పాలిస్తున్నదెవరంటే సమాధానాలు ఎవరేమైనా చెప్పవచ్చు! నిజమైన అధికారం అమెరికన్ డాలర్‌లో ఉంది. అదిప్పుడు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటూ నానాటికీ బలహీనపడుతున్నప్పటికీ ప్రపంచాన్ని శాసిస్తున్నది. భూమండలంపై అత్యంత ధనికులైన ఒక శాతం మంది చేతుల్లో 40 శాతం సంపద కేంద్రీకృతమైంది. ఇదీ నేటి స్థితి. అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ భారత్‌లోని మధ్యతరగతి తిండిపోతులుగా మారిపోయినందున ప్రపంచంలో ఆహార ధరలు పెరిగాయని నోరు పారవేసుకున్నాడు. నిజానికి సకల సంక్షోభాలకు మూలం అమెరికా. అది ఇరాక్‌లో సామాన్యులపై కిరాతక దాడులు జరిగినా, ఆహారం కోసం హైతీలో జనం కొట్లాటలకు దిగినా కారణం అమెరికా అనుసరిస్తున్న విధానమే.

పరిహారాలు కావు ఫలహారాలే

అమెరికాలో కూలిపోయిన తనఖా మార్కెట్‌లో 35 లక్షల మంది సామాన్యులు స్థిరాస్తిగా సంపాదించుకున్న ఇళ్లు కోల్పోయారు. అంతేకాదు వారి పెన్షన్ సొమ్మును పెట్టుబడులుగా పెట్టిన అనేక కంపెనీలు దివాళా తీశాయి. ఇల్లూ, పెన్షన్ సొమ్మూ పోగొట్టుకున్న వారెందరో నేడు అమెరికాలో లబోదిబోమంటున్నారు. లక్ష కోట్ల నుంచి ఆరు లక్షల కోట్ల డాలర్ల వరకు నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇంత సంక్షోభంలోనూ సిఇవోలు మాత్రం కడుపులో చల్ల కదలకుండా అధిక మొత్తాలను పొందుతున్నారు. ముందే చెప్పుకున్న సిటీ గ్రూపు సిఇవో ఉదంతం అలాంటిదే. కంపెనీలు, వాటి వాటాదార్ల ప్రయోజనాలను కాపాడాల్సిన సిఇఓల దివాళాకోరు పథకాలు కంపెనీల దివాళాకు ఒక కారణం. ఇలాంటి వారిలో ఒకరైన కంట్రీ వైడ్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ సిఇవోగా ఏంజలో మోజిలో వచ్చాడు. ఏడాదికి 19లక్షల డాలర్ల వేతనం, బోనస్‌గా 40 నుండి 100 లక్షల డాలర్లు చెల్లించాలని, ఒక వేళ కంపెనీ నుంచి వెళ్లిపోతే 370 లక్షల డాలర్లు చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇటీవలి సంక్షోభంలో కంపెనీ దెబ్బతినటంతో ఉద్యోగ విరమణ పరిహారాన్ని వదులు కోవాలని మోజిలోపై వత్తిడి వచ్చింది. వామపక్ష వాణిజ్య వ్యతిరేక పత్రికలు చేస్తున్న వత్తిడికి తలొగ్గకుండా తనకు పూర్తి మొత్తం



ఐరోపాలోనూ ..

అమెరికాలో మాదిరి చెల్లింపులు ఐరోపాలో లేవు.అయితే ఇక్కడ కూడా సిఇఓల చెల్లింపులు అదుపు తప్పుతున్నాయని లక్సెంబర్గ్ ప్రధాని జీన్ క్లాడ్ జంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నిరోధించేందుకు పన్నులు పెంచాలని సూచించారు. ఐరోపాలో సగటున సిఇఓలకు ఐదు మిలియన్ల యూరోలు మాత్రమే ప్రతిఫలం అందుతున్నది. అదే అమెరికాలో 13 మిలియన్ల యూరోలు ఉన్నది. ఫోర్బ్స్ పత్రిక వెల్లడించిన వివరాల ప్రకారం ఒరాకిల్ సిఇఓ లారీ ఎలిసన్ గతేడాది 193 మిలియన్ డాలర్లు అమెరికాలోనే గరిష్టంగా వేతనం పొందారు. ఐరోపాలోని రేనాల్ట్ కంపెనీ అధికారి గరిష్ట వేతనం 45.9 మిలియన్ డాలర్లు. ఐరోపాలో ఎక్కువ వేతనాలు పొందే సిఇఓలు 20 మందిలో పదిమంది ఫ్రెంచి వారే ఉన్నారు.



చెల్లించాలని ఆయన ఇప్పుడు మధ్యవర్తులపై వత్తిడి తెస్తున్నాడు. మెరిల్ లించ్ అనే కంపెనీ సిఇఓ కూడా గతేడాది ఉద్వాసనకు గురయ్యాడు. ఆ పెద్దమనిషికి కూడా 16కోట్ల డాలర్లు పరిహారంగా చెల్లించారు. మోర్గాన్ స్టాన్లీ కంపెనీ తన 72 సంవత్సరాల చరిత్రలో తొలిసారిగా నష్టాలను చవిచూసింది. ఇక్కడా అదే కథ. థామ్సన్ కంపెనీ కథ మరో విధంగా ఉంది. దాని సిఇఓకు గతేడాది 50 లక్షల డాలర్ల బోనస్ ఇవ్వలేదట. అందుకు గాను 143 లక్షల డాలర్ల విలువగల కంపెనీ వాటాలను కేటాయించారు. అందువలన ఇలాంటివి పరిహారాలు గాక జనం సొమ్మును ఫలహారంగా పంచిపెడుతున్నారని వాటాదార్లు వాపోతున్నారు.

కార్మికుడికి సిఇఓకి ఎంత తేడానో?!

1940వ దశకంలో కార్పొరేషన్లు సగటు కార్మికుడి వేతనం కంటే సిఇఓలకు 48 రెట్లు అదనంగా వేతనాలు చెల్లించాయి. 2006 నాటికి ఈ తేడా 262 రెట్లకు పెరిగింది. ఫోర్బ్స్ పత్రిక వెల్లడించిన 2007 వివరాల ప్రకారం ఒక సాధారణ అమెరికా పౌరుడు పొందే మొత్తానికి కొన్ని కంపెనీల సిఇఓలు 407 రెట్లు పొందుతున్నట్లు వెల్లడైంది. ఒక సాధారణ మహిళ గంటకు ఎనిమిదిన్నర డాలర్ల చొప్పున నెలకు 850 డాలర్లు సంపాదిస్తే అదనంగా ఆమెకు వంద డాలర్లు బోనస్‌గా వస్తుంది. అదీ విధి నిర్వహణలో ఏ తప్పులు చేయకపోతేనే. టైమ్ వార్నర్ సంస్థ సిఇఓ కూడా ఆమెలాగే పని చేస్తాడు. అయితే ఆ ఉద్యోగం ఒక సాధారణ కార్మికుడి వంటిది కాదు. వార్నర్ కంపెనీలో పెట్టుబడులు పెట్టిన వారికి తగిన ప్రతిఫలం అందేట్లు చూడటం సిఇఓ విధి. అందుకుగాను అతనికి వాటాదార్లు వేతనం చెల్లిస్తారు. అయితే వార్నర్ కంపెనీ సిఇఓ పార్సన్స్ ఘోరంగా విఫలమయ్యాడు. నాలుగు సంవత్సరాలు పని చేసిన తరువాత వార్నర్ కంపెనీ షేర్ల ధర 31శాతం పడిపోయింది. ఆ విధంగా వాటాదార్లను నష్టపరిచినా ఉద్యోగం నుంచి బయటకు వెళ్లిపోయే ముందు 53 మిలియన్ల డాలర్లు పరిహారం పొందాడు, అదిగాక ఏడాదికి పన్నులు లేని ఎనిమిది లక్షల డాలర్ల వేతనం, 32 మిలియన్ల డాలర్ల బోనస్ పొందాడు.



ఎన్ని సౌకర్యాలో...

అమెరికాలో కంపెనీలన్నీ వడిదుడుకులు ఎదుర్కొంటున్నా గతేడాది కంటే ఈఏడాది కంపెనీ ఉన్నతాధికార్ల వేతనాలు 23శాతం పెరిగాయి. కంపెనీల ఉన్నతాధికార్లకు ఎలా ప్రతిఫలం కట్టబెడతారో చూడండి. యుఎస్‌టి కార్పొరేషన్ అనే కంపెనీ పొగాకు, వైన్ వ్యాపారం చేస్తుంది. దాని సిఇఓకు 60లక్షల డాలర్లు వేతనంతో పాటు 6,500 డాలర్లు వైన్ అలవెన్సు ఇచ్చింది. ఇది గాక కంపెనీ తరపున నిర్వహించే కార్యక్రమాల్లో డైరెక్టర్లు పాల్గొంటే వైన్ సరఫరాకు ఎలాంటి పరిమితులు ఉండరాదని ఆదేశాలు జారీ చేసింది. అనెషుర్-బుష్ అనే కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు కుటుంబ సభ్యులు, స్నేహితులతో పాటు కంపెనీ జట్ విమానంలో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఉచితంగా క్షవరం చేయించుకోవచ్చు. ఇక కంపెనీ బీరు వినియోగంలో ఎలాంటి పరిమితులు లేవు. వినోదం, హోటళ్లు ఇతర సౌకర్యాల గురించి చెప్పనవసరం లేదు. అంతే కాదు కంపెనీ బాసుల వెన్నంటి ఉండే వ్యక్తిగత కార్యదర్శులకు కూడా ఇలాంటి సౌకర్యాలే వారి స్థాయిలో ఉంటాయి.

ఐ2 టెక్నాలజీస్ అనేకంపెనీ సిఇఓ ఇంటి నుంచి ఆఫీసుకు విమానంలో వచ్చి వెళ్లినందుకు ఏడాదికి పదిలక్షల డాలర్లను కంపెనీ చెల్లించింది. విమానాల్లో తిరిగినందుకు 69 వేలడాలర్ల పన్నును కూడా కంపెనీ వాటాదార్ల సొమ్మునుంచే చెల్లించారు. ఇలాంటి చెల్లింపులు చేయకపోతే సిఇఓలను ఆకర్షించలేమని కంపెనీ పేర్కొన్నది.

తెల్సా!

❖అమెరికాలో కార్మికుడికి గంటకు చెల్లించే కనీస వేతనం 5.15 డాలర్లు.

❖ కార్పొరేట్ కంపెనీల్లో పని చేసే పార్ట్‌టైమ్ కొందరు ఉన్నతాధికారుల గంట వేతనం 21 వేల డాలర్లు.

❖ 2006లో 85 కంపెనీల డైరెక్టర్లు సగటున పదిలక్షల డాలర్లకుపైగా పొందారు. వారు ఏడాదిలో కేవలం పది సమావేశాలకు హాజరై, కొన్ని సలహాలు ఇచ్చి ఈ ప్రతిఫలం పొందారు.

పని చేయకపోయినా ప్రతిఫలం

కొన్ని కంపెనీలు అసలు పని చేయకపోయినా, లేదా రోజుకు కేవలం రెండుగంటలే పని చేసినా మిలియన్ల డాలర్లు పలు రూపాల్లో చెల్లిస్తున్నాయన్నది నమ్మలేని నిజం. బయోమెట్ అనే కంపెనీ డేన్ మిల్లర్ అనే సిఇఓకు ఒక ఏడాదిలోనే 350శాతం పెంచింది. ఎందుకో తెలుసా? సిఇఓ బాధ్యతల నుంచి వైదొలగి తమకు పోటీదారులైన ఇతర కంపెనీల్లో చేరకుండా తమకు వారానికి కేవలం పదిగంటల పాటు మాత్రమే అందుబాటులో ఉండే సలహాదారుగా ఉండటానికి అంగీకరించినందుకు. పది గంటల పనికి గాను ఒక ఆఫీసును, కార్యదర్శిని... ఖర్చులకు గాను లక్షడాలర్లను కూడా చెల్లిస్తుంది. అంతేనా ఆయన భార్యకు కొన్ని వాటాలు, కారు వంటి ఇతర సౌకర్యాలను కూడా సమకూర్చింది.

యునైటెడ్ హెల్త్ గ్రూప్ సిఇఓ ఉద్యోగవిరమణ పరిహారంగా 110 కోట్ల డాలర్లు, ఎక్సాన్ మోబిల్ కంపెనీ సిఇవోకు 40 కోట్ల డాలర్లు, న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ అధికారికి 18 కోట్ల డాలర్లు యాజమాన్యాలు చెల్లించాయి. ఇలాంటి చెల్లింపుల గురించి విమర్శలు వెల్లువెత్తటంతో డైరెక్టర్ల వేతనాలు, అలవెన్సుల గురించి వివరాలు వెల్లడించాలని సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ ఆదేశాలు జారీ చేసింది. భారీ మొత్తాలను ప్రతిఫలంగా తీసుకుంటున్న సిఇఓల గురించి వచ్చిన విమర్శల దృష్ట్యా ఎఫ్‌బిఐ విచారణ కూడా జరుపుతోంది.

❋



జి. ఎల్. నరసింహారావు

హైకోర్టు న్యాయవాది, 9848994240

చదువు లేనివాళ్లను చేసి...పొలమంతా రాయించుకుంటే...

మేము మైదాన ప్రాంత గిరిజనులం. మా నానమ్మ తల్లికి 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది (స్వార్జితం). తనకు ఇద్దరు కుమార్తెలు. వీరందరూ పూర్తి నిరక్షరాస్యులు. దీన్ని ఆసరాగా తీసుకొని మా ఊరి పెద్దమనిషి (భూస్వామి) మమ్మల్ని నిలువునా ముంచాడు. మా నానమ్మ తల్లి పేరిట 10 ఎకరాలు మాత్రమే పట్టా చేయించి ...మిగతా 10 ఎకరాలు వాళ్లకు తెలియకుండా తన పేరిట పట్టా (1969లో) చేయించుకున్నాడు. మరుసటి సంవత్సరం 1970లో మిగతా 10 ఎకరాల భూమిని వారి దగ్గర కౌలుకు తీసుకుని, వారు అమ్మినట్టుగా తన భార్య పేరిట పట్టా చేయించాడు. మా నానమ్మ తల్లిగాని, మేజర్లయిన వారి కూతుళ్లు గాని ఇక్కడ సంతకం పెట్టలేదట. ఈ తతంగం అంతా మరో సంవత్సరంలో రిటైర్ కాబోయే అధికారి చేత చేయించాడట. రిజిస్ట్రేషన్‌లో నిల్ ఉంది. అయితే 1987లో స్వచ్ఛందంగా 15 ఎకరాలు మానాన్నకు తిరిగి ఇచ్చేశాడు. పట్టా మాత్రం మా నాన్న పేరిట చేయలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మేమే సాగు చేసుకుంటున్నాం. పహణీలు కూడా ఉన్నాయి. పట్టా మాత్రం ఆయన, ఆయన భార్య పేరుతో ఉండటంతో వారి కుమార్తె భూమి లాక్కోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. వారివద్ద పట్టా పుస్తకం గాని, టైటిల్ గీడ్స్‌గాని లేవు. నకిలీ పాసుపుస్తకం ఉంది. అది మాకు చూపించడం లేదు. దీనిపై మేం కోర్టులో కేసు వేస్తే మాకు ఏమైనా ప్రయోజనం వుంటుందా? దయచేసి తగిన సలహా చెప్పండి?

ఎన్. సురేందర్, అదిలాబాద్.

పట్టా చేపించడం అంటే పహణీల్లో రాయించుకున్నారా? రిజిస్ట్రేషనా? అనేది తెలుపలేదు. పట్టా రెవెన్యూ అధికారులతో చేయించుకుని ఉంటే ఎటువంటి కాగితాల్లో (మీ ప్రకారం తప్పడు / మోసంతో సంపాదించిన కాగితాలు) ద్వారా చేయించు కున్నాడా? మీకు తిరిగి ఇచ్చేటప్పడు భూమి మాత్రం ఇచ్చి కాగితం ఏమైనా రాయించి ఇచ్చారా? భూమి మీవద్ద ఉండి, పట్టా వారి పేరు మీద ఉండి... రెవెన్యూ రికార్డు ప్రకారం, మీరు అనుభవదారుగా మాత్రమే వుంటే ఏ విధమైనటువంటి అనుభవదారుడనేది వివరించలేదు.

మోసంతో తప్పడు పత్రాలు రాయించుకుని ఉంటే అలా నిరూపించగలిగితే కోర్టులో వేసి నిరూపించవచ్చు. 1987 నుండి మీ నాన్నగారు సాగు చేస్తుంటే అది కౌలుదారుగానా, స్వంత దారుగానా అనే విషయాన్ని బట్టి మీ భూమిపై హక్కులు పొందడం జరుగుతుంది. పత్రాలు చూడకుండా సవివరంగా చెప్పడం భావ్యం కాదు. పత్రాలు తీసుకుని న్యాయవాదిని సంప్రదించండి.

చెల్లని చెక్కుతో కాయకష్టానికి వెల కడితే...

మేం కాయకష్టం చేసి భూమి తల్లిని నమ్ముకున్న రైతులం. మేము మా గ్రామంలో పత్తి చేను వేసి అప్పులు చేసి పంట పండించాం. లోకల్ మార్కెట్లో అమ్మితే తక్కువ రేటు వస్తుందని, ఇంటివద్దనే గుంటూరు వ్యాపారులకు అమ్మాం. ఒక లక్షా 50 వేలకు గాను వారు 15,000/- రూపాయలు ఇచ్చి ఒక లక్షా 35 వేలకు చెక్కు ఇచ్చారు. వారి మిత్రుడి చేత ప్రామిసరీ నోటు రాయించి 10 రోజుల్లో ఇస్తామని నేటికి రెండు నెలలవుతున్నా ఇవ్వడంలేదు. బాగా తిప్పించుకుంటున్నారు. పని చెడి పోయినా ఫలితం లేదు. వారిచ్చిన చెక్కు చెల్లుబాటు కాలేదు. 'డబ్బులు లేవు' అని వాపసు వచ్చింది. వ్యవసాయానికి పెట్టుబడులు లేక అలమటిస్తున్నాం. మాకేది దిక్కు? మా గ్రామంలో మరో 10 మంది రైతులది ఇదే పరిస్థితి. సలహా ఇవ్వగలరు?

వెంకట్, సూర్యాపేట్.

మీరు పండించిన పంటను అమ్ముకోవడానికి ప్రభుత్వం వారు మార్కెట్ యార్డులను నిర్మించారు. అక్కడ అమ్ముకుంటే వెంటనే మీ డబ్బులు మీకు వచ్చేవి. ఇంటి దగ్గరకొచ్చే దళారులు అధిక రేటు ఆశచూపి అడ్రస్ లేకుండా పోయే ప్రమాదం ఉంటుంది. పోలీసు కేసు పెట్టండి, 'చీటింగ్' సెక్షన్ కింద చర్య తీసుకోవచ్చు.

మీరు మెజిస్ట్రేటు కోర్టులో కూడా కేసు వేయవచ్చు. ప్రో నోటు, చెక్కు ఉంది కావున డబ్బులు వసూలు కాని సివిల్ దావా కూడా వేసుకోవచ్చు. కాని ఏదైనా సమయం తీసుకుంటుంది. కేసులు తేలే వరకు మీరు డబ్బుల కోసం వేచి ఉండవలసి వుంటుంది.

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవు తున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహా రావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.మా

చిరునామా:

ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం,
స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్,
హైదరాబాద్ - 500 020

కథ

మేమూ సమాజంలో భాగమే...



గట్టుపల్లి సీతారామారావు

"ఏమండీ!" అటుగా పోతున్న ఓ అబ్బాయిని పిలిచారు. చొంగలు కార్చుకుంటూ ఆ అబ్బాయి వచ్చి "ఏం కావాలన్నట్టు" కాలర్ ఎగరేసుకుని నిలబడ్డాడు.

"ఆరవ అంతస్తుకి వెళ్ళాలంటే లిఫ్ట్ ఎక్కడుంది?" ప్రశ్నించింది రమ. "ఈ బిల్డింగ్‌లో లిఫ్ట్ లేదు. ప్చ్...! మీరు ఆరవ అంతస్తుకి వెళ్ళాలా!" అంటూ జాలిగా చూసి వెళ్ళాడు ఆ వ్యక్తి.

అరగంట గడిచింది. మెట్లెన్నో కనుక్కున్నారు. కానీ మెట్ల పక్క వీల్‌చైర్ పోవడానికి అనువుగా ఏదీ లేదు. మెట్లని ఆధారంగా చేసుకొని పోదామన్నా పడిపోతే పట్టుకోవడానికి ఆధారమూ లేదు. వీల్‌చైర్ అక్కడ వదిలేసి ఇద్దరూ ఒకరి చేయి ఒకరు పట్టుకొని, ఓ చేతితో మెట్లను సపోర్ట్ చేసుకొని, మెల్లి మెల్లిగా పాకుతూ పైకి ఎక్కసాగారు.

సనత్‌నగర్ నుంచి తొమ్మిదవ నెంబర్ బస్ చార్మినార్‌కు బయల్దేరింది. బస్సు బయలుదేరిన దగ్గర నుంచే విపరీతమైన రద్దీగా ఉంది. కండక్టర్ టికెట్లు ఇవ్వటంలో, బస్‌పాస్‌లు చెక్ చేయడంలో చమటలు కక్కుతున్నాడు. సీట్లు దొరికిన వారు కునుకుతున్నారు. నిలబడ్డవారు సీటు ఎప్పటికి దొరుకుతుందో అంటూ ఆశావహంగా ఆలోచిస్తూ ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ కుదుపులతో బస్‌ని అదుపు చేస్తూ పోనిస్తున్నాడు. ఎర్రగడ్డ బస్ స్టాప్ వచ్చింది. ఒకావిడ నిండు గర్భిణి. అతికష్టం మీద బస్‌లోకి ఎక్కింది. కూర్చోవడానికి సీటు కోసమా అన్నట్టు చూసింది. లేడీస్ సీట్లన్నీ ఆక్రమించుకుని దర్జాగా కూర్చున్న మగాళ్ళు, ఆమె పొట్ట వంక నిరసనగా చూసి తల తిప్పుకున్నారు. తోటి స్త్రీలు ఈవిడకు సీటిస్తే మేం మా గమ్యం చేరేవరకూ ఎలా నిలబడగలమని తల దించుకున్నారు.

"ఇంతలో కూర్చో అక్కా!' అంటూ...ఓ పంతొమ్మిదేళ్ళ అమ్మాయి లేచి నిలబడి, తన సీటు ఇచ్చింది. ఆ గర్భిణీ స్త్రీ చాలా సంతృప్తితో కృతజ్ఞతతో కూడిన చూపులతో ఆ సీటులో కూర్చుని "థ్యాంక్స్" అని చెబుతూ ఒక్క నిమిషం నిశ్చేష్టురాలైంది.

తనకు సీటు ఇచ్చిన అమ్మాయికి ఒక పాదం లేదు. చేతులతో పైనున్న రాడ్ పట్టుకుని, బ్యాలన్స్‌గా నిలబడే ప్రయత్నం చేస్తోంది. మెల్లిగా బ్యాగు తగిలించుకొని, చంక కిందికి ఓ కర్ర పెట్టుకొని, బ్యాలెన్స్ చేసుకుంటూ నిలబడింది.

ఇంతలో బస్‌లోంచి "తను దూర దానికి సందు లేదు. పైగా వేరేవారికి సహాయం" అన్నారెవరో.

"ఈ వికలాంగులు ఇంతేరా! ఏదో ఒక అంగ లోపంతో భాదపడుతూ మిగతా వాళ్ళ కంటే తామే ఎక్కువ అని గుర్తించేలా ప్రవర్తిస్తుంటారు" అన్నారు ఇంకొకరు.

ఇంతలో కండక్టర్ వచ్చాడు "ఏమ్మా చాలా దూరం ప్రయాణం చేయాల్సిన దానివి. అదిగో ఆ ముందర సీటు వికలాంగుల కోసం కేటాయించిందే. అందులో కూర్చోపో!" అంటూ డ్రైవర్‌కి ఎడమ పక్కన ముందర వైపు వున్న సీటు చూపించాడు కండక్టర్. కాని అప్పటికే ఆర్.టి.సి. స్టాఫ్ అంటూ ఎవరో ఇద్దరు ఆ సీటుని ఆక్రమించుకుని వున్నారు. ఆ అమ్మాయి ధైర్యం చేసి, వారిద్దరి దగ్గరకు వెళ్ళి నిలబడింది. వారిలో కదలిక లేదు.

"ఎక్స్‌క్యూజ్‌మీ!" అంటూ వాళ్ళ వంక అభ్యర్థనగా చూసింది. వారిలో ఒకతను లేచాడు. రెండో వ్యక్తి నా పక్కన కూర్చోవడమే నీ అదృష్టం అన్న పద్ధతిలో చూశాడు. ఆ అమ్మాయి సర్దుకుని కూర్చుంది. మొత్తానికి ఆ అమ్మాయికీ సీటు దొరికినందుకు గర్భిణీ స్త్రీ సంతోషించింది.

"నీ...మ్మా కుంటోళ్ళమో, గుడ్డోళ్ళమో అయినా బాగుండేది. బస్‌లో ఎంచక్కా సీటు దొరికేది" అని తిట్టుకున్నారు కొంత మంది ప్రయాణీకులు.

గాంధీ భవన్ బస్‌కి అటూ ఇటూ భారీగా ట్రాఫిక్. బస్‌ను బస్‌స్టాప్‌లో ఆపడానికి వీల్లేకపోయింది డ్రైవర్‌కు. ఆ అమ్మాయి లేచి, ఆపమన్నట్లుగా డ్రైవర్‌ని చూసింది. డ్రైవర్ ఆ ట్రాఫిక్ మధ్యలోనే బస్ ఆపు చేశాడు. మెల్లగా చేతి కర్ర సాయంతో దిగింది ఆ అమ్మాయి అటూ ఇటూ ట్రాఫిక్ రద్దీ. ఓ ఆటో దాదాపుగా గుద్దుతుందేమో అన్నంత దగ్గరగా వచ్చి ఆగింది. ఆటో డ్రైవర్ చిరాగ్గా చూశాడు. ఆటోలో ప్రయాణీకులు అసహనంగా చూశారు ఆమె వంక. మెల్లిగా ఫుట్‌పాత్ మీదకు చేరుకుని ఒక కిలో మీటర్ దూరం నడిచింది. అక్కడ పెద్ద అపార్ట్‌మెంట్. ప్రభుత్వ ఆఫీసులన్నీ అందులోనే ఉంటాయి.

ఒక చేతితో కర్రని బ్యాలన్స్ చేస్తూ, ఇంకో చేతితో తన చేతిలోని బ్యాగ్‌లో వెతకసాగింది. రెండు నిమిషాల ప్రయత్నం తరువాత ఆమెకు కావలసిన పోస్ట్‌కార్డ్ దొరికింది. ఆ కార్డు మీద రాసుకున్న తన అడ్రస్ చూసి మురిసిపోయింది ఒకసారి. కుమారిదేవి, డాటరాఫ్ కనకారావు, తిమ్మంపల్లి గ్రామం, యల్లనూరు మండలం, అనంతపురం జిల్లా. 'హమ్మయ్య! నాదే ఈ కార్డు' అని నిశ్చయించుకొని, ఓసారి ఊపిరి పీల్చుకొని "అవును.. ఎన్ని వందల సార్లు ఈ కార్డులో ఫ్రం అడ్రస్, టు అడ్రస్ చదువుకున్నాను" అని నవ్వుకుంది.

కార్డుమీదున్న అడ్రస్ ఇంకోసారి చూసుకుంది. "వికలాంగుల సేవా సంస్థ, ఆరవ అంతస్థు, గగన్ విహార్ బిల్డింగ్స్, హైదరాబాద్".

ఆ బోర్డు ఎక్కడ కనిపిస్తుందో అని అక్కడ వున్న వందల బోర్డులలో వెతకసాగింది. చివరికి ఆ అమ్మాయి ప్రయత్నం ఫలించింది. ఇంతలో ఎవరో తుంటరి ఆమెను రాసుకుంటూ కర్రని కావాలనే తగులుకుంటూ స్పీడ్‌గా వెళ్లాడు. బ్యాలెన్స్ తప్పి కింద పడబోయింది. ఇంతలో ఎవరిదో చేయి ఆమెని పడకుండా ఆపింది.

'థ్యాంక్స్!' అంటూ తనకు సపోర్ట్ ఇచ్చిన

వారి వంక చూసింది ఆ అమ్మాయి.

"నా పేరు రమ" అంటూ వీల్ ఛైర్‌లో కూర్చున్న ఆ అమ్మాయి నవ్వింది.

"నా పేరు దేవి" అంటూ రమకి షేక్‌హ్యాండిచ్చింది.

"మీకు కూడా కార్డు వచ్చిందా" కలుపుగోలుగా అడిగింది వీల్ ఛైర్‌లో ముందుకు తోసుకొనిపోతూ రమ.

ఇద్దరూ పెద్ద గేట్‌లోంచి లోపలికి వచ్చి అటూ ఇటూ చూశారు.

"ఏమండీ!" అటుగా పోతున్న ఓ అబ్బాయిని పిలిచారు. చొంగలు కార్చుకుంటూ ఆ అబ్బాయి వచ్చి, "ఏం కావాలన్నట్టు" కాలర్ ఎగరేసుకుని నిలబడ్డాడు.

"ఆరవ అంతస్థుకి వెళ్ళాలంటే లిఫ్ట్ ఎక్కడుంది?" ప్రశ్నించింది రమ. "ఈ బిల్డింగ్‌లో లిఫ్ట్ లేదు. ప్చ్...! మీరు ఆరవ అంతస్తుకి వెళ్ళాలా!" అంటూ జాలిగా చూసి వెళ్ళాడు ఆ వ్యక్తి.

అరగంట గడిచింది. మెట్లన్నీ కనుక్కున్నారు. కానీ మెట్ల పక్క వీల్‌ఛైర్ పోవడానికి అనువుగా ఏదీ లేదు. మెట్లని ఆధారంగా చేసుకొని పోదామన్నా పడిపోతే పట్టుకోవడానికి ఆధారమూ లేదు. వీల్‌ఛైర్ అక్కడ వదిలేసి ఇద్దరూ ఒకరి చేయి ఒకరు పట్టుకొని, ఓ చేతితో మెట్లను సపోర్ట్ చేసుకొని, మెల్లి మెల్లిగా పాకుతూ పైకి ఎక్కసాగారు.

మధ్యలో మెట్లెక్కుతున్న కొందరు ఆగి చూశారు. ఆయాసం ఎక్కువైంది ఇద్దరికీ. మూడో అంతస్తు చేరుకునే సరికల్లా కాళ్ళు నొప్పులు మొదలయ్యాయి. కాసేపు విశ్రాంతి తీసుకుందామని ఆ మెట్ల మీదే కూలబడ్డారు ఇద్దరూ.

"నాకు పోలియో వచ్చింది. చిన్నప్పుడు మా అమ్మ నాన్నా ఇద్దరూ ఉద్యోగస్తులే అయినా నన్ను పట్టించుకునే తీరిక, ఓపిక ఎప్పుడూ లేదని అనుకుంటాను. పోలియో డ్రాప్స్ వేయించలేదు. నాకు పోలియో వచ్చిన తరువాత వాళ్ళు ఎంత బాధపడినా, ఎంత ఖర్చుపెట్టినా, ఎంత మంది డాక్టర్లకు చూపించినా వీల్ ఛైర్ తప్పలేదు నాకు" బాధగా చెప్పింది రమ.

"మాది పల్లెటూరు గదా! మితిమీరిన వేగంతో వాహనాలు వస్తూ పోతుంటాయి. ఓసారి నేను ఆడుకుంటుంటే మోటార్ సైకిల్ నా పాదం మీద నుంచిపోయింది. నేను రోడ్డు పక్కనే ఆడుకుంటున్నా, అభ్యంతరం చెప్పని మా అమ్మ తప్పో, వాహనాన్ని కంట్రోల్ చేయలేని ఆ వ్యక్తి తప్పో గాని ఓ పాదం పోయింది" అంది దేవి.

"అవిటితనమే మనకు శాపం. భారం. కానీ ఇంకా అంధులు చాలా మంది వున్నారు. అలాగే బుద్ధిమాంద్యం గల వారు చాలా మంది వున్నారు. ఈ మరుగుజ్జులు అనే వారు కూడా వికలాంగుల కిందకే వస్తారనుకుంటా!" అంది రమ.

"అవును మనకింకా అర్ధగంట టైం ఉంది. వికలాంగుల సేవా సంస్థకి త్వరగా చేరుకుందాం" అని అనుకుంటూ తిరిగి మెట్లపైకి వెళ్లసాగారు. ఆరవ అంతస్థు వచ్చింది. పెద్ద పెద్ద అక్షరాలతో వున్న వికలాంగుల సేవా సంస్థ బోర్డు చూసి లోపలికి వెళ్ళారు. అక్కడ ఓ భారీకాయం కనిపించింది వీరికి.

ఒక్కొక్కరిదీ ఒక్కో బాధ, ఒక్కో గాధ, ప్రసవ సమయంలో నిష్ణాతురాలైన నర్స్, డాక్టర్ల సహాయం తీసుకోకపోవడం వలన ఒకరు వికలాంగులుగా ఇంకొకరు తమ తల్లిదండ్రుల మేనరికపు వివాహం వలన ఇలా అయ్యామన్నారు.

భారీకాయం వచ్చి "రండి. డైరెక్టర్ గారు వచ్చారు. ఆయన రోజుకు అర్ధగంట మాత్రమే ఆఫీసులో వుంటారు" అంటూ అందరినీ డైరెక్టర్ గారి వద్దకు తీసుకెళ్ళింది.

"చూడండమ్మా! నా పేరు బి.ఎన్. మూర్తి. ఈ వికలాంగుల శాఖకు ప్రత్యేకించి నన్ను డైరెక్టర్‌గా నియమించారు. మేము మీకు ప్రత్యక్షంగా ఆర్థిక సహాయం ఏమీ చేయము. మీకు ఆర్థిక సహాయం చేయమని మీ దగ్గర్లోని బ్యాంక్ వారికి రికమెండేషన్ లెటర్ ఇస్తాం. దానిని వారు ఆమోదించవచ్చు. ఆమోదించకపోవచ్చు".

"ఎందుకొచ్చారు?" దాదాపుగా అరుస్తున్నట్టుగా అడిగింది భారీకాయం. ఇద్దరూ కార్డు చూపించారు.

ఆ కార్డులను వీరిని మార్చి మార్చి ఎగాదిగా చూసింది భారీ కాయం.

మంచి నీళ్ళు కావాలన్నట్లుగా సైగ చేశారు రమ, దేవి. ఓ గ్లాసు మంచినీళ్ళ చెంబుతో వచ్చింది భారీకాయం.

"ఈవిడకేమీ వైకల్యం లేదే. మరి ఈ శాఖకు ఈవిడను ప్రధానాధికారిగా చేస్తే వికలాంగుల సమస్యలు ఈవిడకేం అర్థమవుతాయి?" అని ఆలోచించసాగింది రమ.

"అయితే మీరిద్దరూ ముందుగా మీ సర్టిఫికెట్ చూపించండి" అడిగింది భారీకాయం అధికార స్వరంతో. చూపించారు ఇద్దరూ.

సర్టిఫికెట్స్ చూసి "గుడ్" అంటూ సంతృప్తిగా తలాడించి 'అదిగో ఆ పక్క రూంలో కూర్చోండి' అంటూ ఓ గదిని చూపించింది భారీ కాయం. ఆ గదిలోకి వెళ్ళి అప్పటికే అక్కడకు వచ్చి వున్న ఇంకో పది మంది వికలాంగులతో మాటలలో పడ్డారు రమ, దేవి.

ఒక్కొక్కరిదీ ఒక్కో బాధ, ఒక్కో గాధ, ప్రసవ సమయంలో నిష్ణాతురాలైన నర్స్, డాక్టర్ల సహాయం తీసుకోకపోవడం వలన ఒకరు వికలాంగులుగా జన్మించారు. ఇంకొకరు తమ తల్లిదండ్రుల మేనరికపు వివాహం వలన ఇలా అయ్యామన్నారు.

భారీకాయం వచ్చి "రండి. డైరెక్టర్ గారు వచ్చారు. ఆయన రోజుకు అర్ధగంట మాత్రమే ఆఫీసులో వుంటారు" అంటూ అందరినీ డైరెక్టర్ గారి వద్దకు తీసుకెళ్ళింది.

"చూడండమ్మా! నా పేరు బి.ఎన్. మూర్తి. ఈ వికలాంగుల శాఖకు ప్రత్యేకించి నన్ను డైరెక్టర్‌గా నియమించారు. మేము మీకు ప్రత్యక్షంగా ఆర్థిక సహాయం ఏమీ చేయము. మీకు ఆర్థిక సహాయం చేయమని మీ దగ్గర్లోని బ్యాంక్ వారికి రికమెండేషన్ లెటర్ ఇస్తాం. దానిని వారు ఆమోదించవచ్చు. ఆమోదించకపోవచ్చు".

అందరికీ ఒక్కసారి నీరసం ఆవహించింది. ఇంత దూరం వచ్చి మళ్ళీ అంత కష్ట పడి ఆరు అంతస్థులు దిగి వెళ్ళాలి. కాబట్టి ఏదో కొంతైనా ప్రయోజనం పొంది వెళ్ళాలని నిశ్చయించుకున్నారు అందరూ. మళ్ళీ అర్థించారు.

"ప్రభుత్వ ఉద్యోగాలలో 3 శాతం వికలాంగులకు కేటాయిస్తున్నారు. మీరు దరఖాస్తులు చేస్తూ ఉండండి. అదృష్టం బాగుంటే, దేవుడు దయదలిస్తే మీకు ప్రభుత్వ ఉద్యోగాలు రావచ్చు"

అన్నదా భారీ పర్సనాలిటీ.

దేవుడి దయ అనేసరికి సగం మంది వికలాంగులకు నవ్వు వచ్చింది. ఆ దేవుడి దయ సరిగ్గా ఉంటే మా బ్రతుకూ సరిగ్గా వుండేదనుకున్నారు.

"కాబట్టి, పబ్లిక్ టెలిఫోన్ దుకాణాలు, కిరాణా దుకాణాలు మీకు సరిగ్గా సరిపోతాయి. వాటికి మహా అయితే అయిదు వేల నుంచి పది వేల లోపు ఋణం చాలు. మీ దరఖాస్తులు ఇచ్చి, రేపు వచ్చి రికమెండేషన్ లెటర్లు తీసుకెళ్ళండి" అన్నాడు వికలాంగ శాఖ డైరెక్టర్ బి.ఎన్. మూర్తి.

"క్షమించండి సార్! ఈ సర్వీసులు అందిస్తున్న మీకు నెలకు జీతం ఎంతిస్తారో తెలీదు. మీరు సకలాంగులు. మీకు వికలాంగుల బాధలు చెబితే అర్థంకావు సార్. మీరు ఓ కాలుకు కట్టు కట్టుకుని, కొంత దూరం నడవండి. అవిటితనంలో ఉన్న బాధ తెలుస్తుంది. కళ్ళకు గుడ్డ కట్టుకుని ఓ గదిలోంచి ఓ గదిలోకి వెళ్ళండి. అంధత్వం అంటే ఏమిటో తెలుస్తుంది" ఆవేశంగా అంది రమ.

"సార్! అంగవైకల్యం కలవారికి సహాయ సహకారాలు అందించవలసిన సకలాంగులు, వారు సరిగ్గా నడుద్దామని ప్రయత్నిస్తుంటే చేయూత నివ్వడానికి ముందుకు రాకపోగా ... ఇంకా కాలు అడ్డం పెట్టి పడేయడానికి ప్రయత్నిస్తారు" అంది దేవి.

మిగతా వికలాంగులందరూ చప్పట్లు కొట్టారు.

"అయితే ఈ శాఖ ద్వారా మేం ఏం చేయాలని మీరు భావిస్తున్నారో అది రాసి ఇవ్వండి. ప్రభుత్వానికి అందచేస్తాను" అన్నాడు డైరెక్టర్.

అందరూ కలసి ఆలోచించారు. అందరి సమస్యలూ దాదాపు ఒక్కటే. సమాజం నుంచి పొందుతున్న అవమానం, వికలాంగులని కనికరం లేని కాముకుల అత్యాచారాలు. ఎక్కడికి వెళ్ళినా అంగ వైకల్యం మిషతో అడ్డమైన పేర్లతో పిలవడం. అందరూ కలసి ఒక కాగితంపై మూకుమ్మడిగా సంతకాలు చేశారు.

దాని సారాంశం ఇది...

"గౌరవనీయులైన శాఖాపతి గారికి,

వికలాంగులమయిన మేము సమాజంలో ఒక భాగం. సమాజం మమ్మల్ని మిగతావారితో సమానంగా గౌరవించాలని కోరుకుంటున్నాం".

"మంచిదమ్మా! మీ కోరిక నెరవేరాలని ఆశిస్తున్నాను" అంటూ వికలాంగుల సేవా సంఘం బోర్డు ఆఫ్ డైరెక్టర్ నిట్టూర్చాడు.

లోగిలి లోగిలిలో...

డా॥ జె.పి. వైద్య

సత్యజిత్ రే... ఒక జ్ఞాపకం!



మేం మెడికల్ కాలేజీలో ఒకవైపు అనాటమీలో మానవ కళేబరాలు చీరుతూ, మరోవైపు, 'నాటకాలూ- చర్చా పత్రాలూ- ఆర్ట్-సినిమాలు-సంగీతం' లాంటివన్నీ ఏకుతూ, పీకుతూ ఉండేవాళ్ళం. కాలాంతరంలో అవి నేటిదాకా మమ్మల్ని ఆత్మీయంగా అంటుకొని ఉండిపోయాయి.

అలాగే, ఆ రోజుల్లో 'సాహితీ గోష్ఠులతో' పాటు 'సినిమా ఉత్సవాలనూ' రంగులు వెదజల్లి మరీ ఆస్వాదించేవాళ్ళం.

సత్యజిత్‌రే సినిమాలు ఏరీ కోరీ తెప్పించి, మా కాలేజీ ఆడిటోరియంలో క్రమం తప్పకుండా 'స్క్రీన్' చేశాం.

మా హాస్టల్స్... ఆ వాతావరణం అంతా 'శాంతినికేతన్'లాగా అన్పించేది. కాని కొంత మంది అశాంతిగా గొణుక్కునేవాళ్ళు.

'హుఁ! ఏందీరా గీ స్లోమోషన్ సిన్మాలు చూపిస్తుర్రు... దేశమంతా గరీబులూ... పేదరికం... బిచ్చగాళ్ళేనావురా? డెవలప్‌మెంట్ కన్పడ్తలేదావురా మీ గుడ్డి కండ్లకు? ఏందిరా గీ ఏడుపులూ? టుంయ్...కుంయ్ ఏడ్పు సంగీతం? జర్రంత శంకర్ జైకిషన్...ఓ.పి.నయ్యర్ సేన్మలు తీస్కరారాదావురా? దేశంల రాజ్‌కపూర్, దేవానంద్ సేన్మలక్కరువావురా? పోనీ-గంతగనం ఏడిచే షోకే వుంటే మన నాగేస్రావ్ సాబ్ సేన్మ! ఏందదీ? గా 'జగమే మాయా' కుక్క పాట దేవదాస్ గూడ దొర్కుతలేదావురా మీకు? థూ! మీ ఏడ్పు షోకుల మీద మన్ను పడా...!' అని నోరారా తిట్లతో దీవించిన వాళ్ళూ లేకపోలేదు. తర్వాత రోజుల్లో మేము ఏదో కారణాలతో 'ముంబాయి'లో మూడు రోజులున్నాం. 'బొంబే కే రంగీనియత్' చూడకుండా మూడు రోజుల్లో ఆకలి దప్పులు మరచిపోయి ఏకంగా 12 నాటకాలు చూసి 'ఖుషీ'గా తిరిగి వచ్చాం.

అప్పటిదాకా మెడికల్ కాలేజి మిత్రులైతే చెదిరిపోయారు. కాని, ఈఎన్‌టీ సర్జన్ మిత్రుడు మటుకు ఖుషీగా భుజం తడ్తూ..... 'షెబ్బాష్! బిడ్డా! తీన్ దిన్‌ల బారా నాటక్స్? (మూడ్రోజుల్లో 12 నాటకాలా?) బాగుపడ్తవ్! నీ తీరే గా సత్యజిత్ రే గూడ 'లండన్'ల మూన్నెళ్లున్నడు.... సేన్మలు చూశిండంట... గిసుంటి 'పాగల్ గాల్లుండవట్టే' దేశం వెలిగి పోతున్నది బిడ్డా! షెబ్బాష్!' అంటే మాకు అర్థం కాలేదు. మెచ్చుకుంటున్నాడో? తిట్టుకుంటున్నాడో? అన్నది అర్థంకాలా!

ఏది ఏమైనా 'సత్యజిత్ రే' మన భారతీయ సినిమాను ప్రపంచం ఎల్లల కావలకు తీసుకెళ్ళిన 'భారత రత్న'! ప్రపంచ సినీ నీలాకాశంలో తళతళా మెరిసిన ధృవతార! ఫాల్కే అవార్డ్ (1985)కే వన్నె తెచ్చిన అపురూప కళాకారుడు. అలనాటి హిందీ సినీ తార 'నర్గీస్' కూడా 'భారతదేశంలో పేదరికం తప్ప ఏ రకమైన అభివృద్ధి లేనట్టుగా ఇలాంటి సినిమాలు తీయడం ఎందుకో అస్తమానం' అవి పబ్లిగ్గానే తన అభిప్రాయం వెల్లడించింది. ఆమెకు రాజ్‌కపూర్ సినిమాల్లోని పేదరికం చాటు సాగే జీవితం, కన్నీళ్ళను దాచుకొని వెలిగించే నవ్వులు ఎందుకు జ్ఞాపకం రాలేదో అని చాలా మంది లాగే మేమూ అనుకున్నాం. కాని, నర్గీస్ గురించి ఎక్కువ 'క్రిటికల్'గా ఉండలేక పోయాం. నర్గీస్ రాజ్‌కపూర్ సినిమాలు నేటికీ మా 'వీక్ పాయింట్స్'.

కాని, 1964లోని 'రే' గారి 'చారులత' (ది లోన్లీ వైఫ్), 'మహానగర్' (ది బిగ్ సిటీ), 'కా పురుష్ మహా పురుష్' (ది కవర్డ్ అండ్ ది హోలీ న్యూస్), 'ప్రతిద్వంది' (70), సీమాబద్ధ (71), జనారణ్య (75) చూశాక మా బుర్రలు గిర్రున తిరిగాయి. అవి నేటికీ 'రే' ను తల్చుకున్నప్పుడల్లా ఆత్మీయంగా చలించక మానవు.

'ప్రతిద్వంది'లోని ఆదర్శవాది, సీమాబద్ధ' లోని నైతిక నీతి భాష్యాలకు తిలోదకాల్చిన వైనం 'జనారణ్య' లోని జీవితం కోసం అవినీతిని కౌగిలించే మానవతలు.. బహుశా వీటికి 'సత్యజిత్ రే' అదృష్ట హస్తం దీవెనలు పుష్కలంగా అంది ఉన్నాయేమో!.

మేడే తెల్లవారురుఝామునే... అంటే మే 2,1921 నాడు సంపన్న బెంగాలీ సంస్కృతి సభ్యతలు నిండి ఉన్న కుటుంబంలో జన్మించాడు సత్యజిత్ రే.

వారి వంశంలో సాహిత్యం, చిత్రలేఖనం, తాత్వికత, సాంఘిక ఆచారాలు పుష్కలంగా ఉండేవి. పైగా తాత ఉపేంద్ర కిషోర్ రే బ్రహ్మ సమాజంలో నాయకత్వం వహించిన వాడు. తండ్రి సుకుమార్ రే గొప్ప బెంగాలీ రచయిత. ముఖ్యంగా బాల సాహిత్యంలోనూ, చిత్రలేఖనంలోనూ ఆయన చెయ్యి పట్టుకునే వారు ఆ రోజుల్లో ఎవరూ లేరు. సత్యజిత్ మూడేళ్ళ ప్రాయంలోనే ప్రతిభావంతుడైన తండ్రిని పోగొట్టుకున్నాడు. తల్లి సుప్రభాదేవి అష్టకష్టాలు పడి పెంచి పెద్దవాడిని చేసింది. ఎంత పెద్ద అంతర్జాతీయ ఖ్యాతి గడించినా 'సత్యజిత్' తల్లిని అంతే ఆత్మీయంగా ఆదరించి తనతోనే అట్టి పెట్టుకున్నాడు. డాబు కన్నా అద్దె ఇంట్లోనే అందరూ కలసిమెలసి ఉండేవారు. తల్లి ప్రోద్బలం మీదే ప్రెసిడెన్సీ కాలేజీలో 'ఎకనమిక్స్' చదివాక 'శాంతినికేతన్'కు వెళ్ళాడాయన. మొదటి నుంచి చిత్రలేఖనం ఎడల మమకారం... శాంతినికేతన్‌లో ఆదరభావం, నందలాల్ బోస్, వినోద్ బిహారీ ముఖర్జీల పెయింటింగ్స్ అంటే అవ్యాజాను రాగమూ పెరిగాయి. తర్వాతి రోజుల్లో వాటి మీదే ఆయన అందమైన డాక్యుమెంటరీలు తీసి ఎంతో ప్రసిద్ధి కూడా పొందారు. ఎల్లోరా, అజంతా, ఎలిఫెంటా కుడ్య చిత్రాలంటే మనస్ఫూర్వకమైన ప్రశంసలే ఆయన మది నిండా!

'డి.జె. కేమర్' బ్రిటిష్ అడ్వర్‌టైజింగ్

ఏజెన్సీ'లో కేవలం ఎనభై రూపాయల జీతంతో ఆయన కళా జీవనం ప్రారంభమైంది. ఆ తర్వాత 'సిగ్నెట్ బుక్స్' కవర్ డిజైనింగ్‌తో ఆయన ప్రతిభ నలు దిశలా వేగంగా పాకిపోయింది.

చాలా మందికి బహుశా తెలియకపోవచ్చు. నెహ్రూ 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' జిమ్ కార్బెట్ లాంటి విశ్వ విఖ్యాత 'శికారీ కథలు', 'మ్యాన్ ఈటర్ ఆఫ్ కుమావూం' పుస్తకాల రూపకల్పన, రూప నిర్దేశ 'రే' అన్న విషయం!

'పథేర్ పాంచాలి' అనే 'బిభూతి భూషణ్ బందోపాధ్యాయ్' క్లాసిక్ పుస్తకం అలా కళ్ళల్లో పడ్డదే! అది చాలా రోజులు ఆయనను మానసికంగా వేటాడింది.

1947లో కలకతా ఫిల్మ్ సొసైటీ స్థాపించబడింది. వివిధ దేశాల సినిమాలు చూడటం జరిగింది. రాయల్ ఎర్ ఫోర్స్‌కు సంబంధించిన 'నార్మన్ క్లేర్' 'రే' లోని సినిమా పిచ్చి, పాశ్చాత్య సంగీతం, చదరంగం ఎడల మమకారాన్ని గుర్తించాడు.

'జేన్ రినోయర్' ఆ రోజుల్లోనే తన 'ది రివర్' సినిమా చిత్రీకరణ గురించి కలకత్తా వచ్చాడు. ఇంకేముంది!

లొకేషన్స్ చూయించే జిమ్మేదారీ ఖుషీ ఖుషీగా తన భుజస్కంధాల మీద తీసుకున్న 'రే' సాహెబ్ తన మెదడులో ఎన్నాళ్ళనుంచో తొలుస్తున్న 'పథేర్ పాంచాలీ' ముచ్చట వెళ్ళకక్కాడు. రినోయర్ ఈ చెవి నుండి ఆ చెవిదాకా నవ్వి 'గో అహెడ్' అన్నాడు. అనుకోని వరదానంలా 'కేమర్' పుస్తకాల పని మీద 'రే' ని 'లండన్ వెళ్తారా!' అని అడిగారు. రే వూరికే ఎగిరే గంతేయలేదు. లండన్‌లోనే మూడు నెలల విడిది లో అక్షరాలా 99 సినిమాలు చూసి, నమిలి పారేశారు. 'బై సికిల్ (1948) అనే చిత్రం ఆ రోజుల్లో చాలా మందిని 'పాగల్' చేసిన చిత్రం. భారతదేశం తిరిగి వచ్చాక 'రే'కు చిత్ర నిర్మాణం అనే జాడ్యం చిక్కగా పట్టుకున్నది.

'అప్పు ట్రైయాలజీ' ముందుగా ప్లాన్ చేసిందే కాదు.

ముందు తీసిన చిత్రం 'పథేర్ పాంచాలి'.... అడుగడుగునా ఢక్కామొక్కీలు.. డబ్బులు కరువు. కాసింత జమ చేయడం కూసింత చిత్రీకరించడం. నో మనీ! నో షూటింగ్!! నో సినిమా!! మళ్ళీ తిప్పలు... కాసింత జమ... కాసింత



'పథేర్ పాంచాలి'లో ఓ దృశ్యం

చిత్రం! 52లో మొదలైన తిప్పలు 55లో రిజల్టు నిచ్చాయి.

మన దేశంలోనే కాదు. యావత్ ప్రపంచం సినీ విశ్లేషకులూ, ప్రేక్షకులు ఉలిక్కిపడి లేచి చూశారు. నేటిదాకా కూర్చోలేక పోయారు. అదే స్పీడులో 'అపరాజిత' '-'అపుర్ సంసార్' తీశారాయన.

అదే 'అప్పు ట్రైయాలజీ'! సత్యజిత్ రే ప్రపంచ సినీ వినీలాకాశంలో దేదీప్యమాన తారకలా వెలిగిపోయారు.

ఆయన దర్శకత్వం వహించిన సినిమాలు 37. అందులో అద్భుతం, ఆద్యంతమూ రోమహర్షకమైన ఫీచర్ సినిమాలూ, డాక్యుమెంటరీలూ కూడా ఉన్నాయి. సినిమాలో సర్వం తానే అయిపోయే సత్యజిత్ రే కేవలం - వెండి తెర మోహంతో సరిపుచ్చుకోలేదు. ఆయన ఒక అద్భుతమైన రచయిత. ప్రకాశకుడు, చిత్రకారుడు, గ్రాఫిక్ డిజైనర్, ఫిల్మ్ క్రిటిక్. పొందిన పురస్కారాలకు లెక్కలేదు.

అకాడెమీ ఆనరరీ పురస్కారం (1992), లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్- భారతరత్న- దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్, ఆనరరీ ఆస్కార్ అవార్డ్ (1992), మరణానంతరం 'అకిరా కురోసావా' పురస్కారం. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వారి గౌరవ డాక్టరేట్ ఎంతో అపురూపమైనదని పేర్కొంటారు విజ్ఞులు. చార్లీ చాప్లిన్ తర్వాత ఆ అరుదైన గౌరవం పొందిన తొలి భారతీయుడు 'సత్యజిత్ రే' నే!

జీవితం పెద్ద రాజీ!

నిర్ణయానికీ, అమలుకూ మధ్య బీటలు పడిన వంతెనలా కొన్ని అనుభవాలు జీవితంలోనూ తొంగి చూస్తాయి. 'మోడర్న్ ఇండియా' అంటే పేదరికమేనా అని ఏడుపు గోల కామెంట్స్ చేసిన వాళ్ళూ ఉన్నారు. 'దేవాది దేవుడి'గా పూజించిన వాళ్ళూ ఉన్నారు. తన చిననాటి చెలి 'బిజోయా దాస్' ను ప్రేమించి పెళ్ళి చేసుకున్న సత్యజిత్ రే సినిమానూ, జీవితాన్నీ అమితంగా ప్రేమించిన మనిషి. ఎవరో చెప్పినట్టు ప్రేమ ఒక లెక్క లాంటిది. సంతోషం గుణకారం, దుఃఖం భాగాహారం, స్నేహం కూడిక, శతృత్వం తీసివేత. ప్రేమించబడడానికి వ్యక్తిత్వం ఎంత అవసరమో, ప్రేమించడానికి హృదయం అంతే అవసరం.

తన సినిమాలకు స్క్రిప్ట్స్ రాసుకోవడానికి ఆయన డార్జిలింగ్, పూరీ ప్రాంతపు ఏకాంతాన్ని కోరుకునే వాడు. సినిమా నిండా వెలుగునీడల అపూర్వ సంగమం వెతుక్కునేవాడు. సుబ్రతామిత్రా ఉన్నంత వరకు 'రే' చిత్రాల్లో కెమెరా హంగులూ ధంగులూ చూడ ముచ్చటగా ఉండేవంటారు.

చాలా వరకు ఆయన ఆంగ్లంలో తొలుత స్క్రిప్ట్ రాసుకొని, తర్వాత బెంగాలీకరణం చేసేవారు. బెంగాలీలో కాకుండా వేరే భారతీయ భాషల్లో సినిమాలు తీయడం ఆయనకంత నచ్చేది కాదు.

'ఘరే బాయరే' చిత్రీకరణ సమయంలో ఆయనకు తీవ్రమైన గుండె నొప్పి వచ్చింది. కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకొని ఆ తర్వాత ఆయన ఏకైక చిరంజీవి, 'సందీప్' డైరెక్టర్ బాధ్యతలు విజయవంతంగా కొనసాగించాడు. ఆరోగ్యం కుదుట పడ్డాక 2-3 సినిమాలు ఆయన స్వయంగానే తీశారు. తర్వాతి రోజుల్లో గుండెనొప్పి ఇంకా క్లిష్టంగా మారి 23 ఏప్రిల్ 1992నాడు ఆయన తిరిగి రాని దూర తీరాలకు పయనమై వెళ్ళిపోయారు.

ఈ తీరంలో చతికిల బడ్డ మనం జీవితం చిక్కుముళ్ళు విప్పుతూ, 'షత్‌రంజ్ కే ఖిలాడీ'లా నిలకడగా ఉండలేకపోతున్నాం!

మన తత్వమే అంత!

-'హుం! ఏందిరా! మళ్ల ఇంకో సత్యజిత్ రే పుట్టకపోడా....!' అనుకుంటూ ఏ అవకతవక కంగాళీ కంపు సిన్మా కోసమో పరుగులాట తప్పలేదు మనకు! ఎంతైనా మనం 'షత్‌రంజ్ కీ చాల్' తెలవని సీదా సాదా మనుష్యులం కదా!

❊

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.
ఫోన్ : 08732223622





వీరి వీరి గుమ్మడి పండు
జవాబు

వీరి వీరి
గుమ్మడి
పండు
వీరి పేరు
షారుక్ ఖాన్.

ఎస్. వెంకట్రావు

భూకంప విలయాలను నివారించలేమా?

> ఇంతటి ప్రమాదకరమైన భూకంపాలను నివారించలేమా? అభివృద్ధి చెందిన మానవ మేధ, సైన్సు-సాంకేతిక పరిజ్ఞానం భూకంపామాలు రాకుండా చేయలేవా? పోనీ కనీసం తుపానుల మాదిరిగా ఫలానా సమయంలో భూ కంపం వస్తుందని చెప్పలేమా? అలా చెప్పగలిగితే ప్రజలను ముందుగానే భవనాలు, ఇళ్లూ ఖాళీచేయించి ప్రాణ నష్టం అరికట్టవచ్చు కదా! కాని దురదృష్ట మేమంటే భూ కంపాలను ఆపడం అసాధ్యం. భూ కంపాలు సంభవించే సమయాన్ని, ప్రాంతాన్ని గురించి ఖచ్చితంగా చెప్పడం కూడా ప్రస్తుత మానవ మేధకు అందని విషయం

చైనాలోని సిచువాన్ ప్రాంతంలో సంభవించిన భూకంపం సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. 20,000 మందికి పైగా మరణించగా క్షతగాత్రులైన వారి సంఖ్య అంతుపట్టడం లేదు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం అంచనాలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. బహుశా పూర్తి వివరాలు తెలిసేసరికి కొన్ని వారాలు, నెలలూ కూడా పట్టవచ్చు. కాని మానవ చరిత్రలో సంభవించిన ఘోరమైన భూ కంపాల్లో ఇదీ ఒకటని మాత్రం చెప్పవచ్చు. భూ కంపాలనేవి నిత్యం సంభవిస్తూనే ఉంటాయి. ప్రతి నిత్యం వందలు వేల సంఖ్యలో భూ కంపాలు వస్తుంటాయి. ఒక రకంగా చెప్పాలంటే మనం నిత్యం భుగభుగ లాడే లావాపైన తేలియాడుతున్న భూమి పొరల మీద నివసిస్తున్నాము. నిత్యం చలనంలో ఉన్న భూ ఖండాలు, వాటి కదలికలవల్ల వస్తున్న ప్రకంపనలు మనల్ని వెన్నంటే ఉంటాయి. అయితే అదృష్టమేమంటే ఈ ప్రకంపనల్లో అత్యధిక శాతం మనకు ఎటువంటి హాని కలిగించకుండానే, ఇంకా చెప్పాలంటే మనం గుర్తించకుండానే సాగిపోతూ ఉంటాయి. కాని వీటిలో అతి తక్కువ సంఖ్యలోనైనా తీవ్ర స్థాయిలో వచ్చే భూకంపాల వల్లే పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుంది. భూ కంప తీవ్రతను రిక్టర్ స్కేలు మీద కొలుస్తారు. రిక్టర్ స్కేలు మీద 7 పాయింట్లు దాటిన భూ కంపాలు మహావిలయాలు సృష్టిస్తాయి. ప్రస్తుతం చైనాలో సంభవించిన భూకంప తీవ్రత 7.8 గా రికార్డయింది. అంటే అత్యంత తీవ్రమైన భూకంపాల్లో ఒకటన్న మాట. ఇంతటి పెద్ద భూకంపాలు నేల మీద జనావాసాల్లో సంభవిస్తే ఎంతటి విలయం సృష్టిస్తాయో, సముద్రంలో సంభవిస్తే సునామీల ద్వారా అంతటి విలయాన్నే సృష్టిస్తాయి. అందువల్ల మానవుని పాలిటి మహావిలయ మహమ్మారుల్లో భూకంపాలు ముఖ్యమైనవి.

ఇంతటి ప్రమాదకరమైన భూకంపాలను నివారించలేమా? అభివృద్ధి చెందిన మానవ మేధ, సైన్సు-సాంకేతిక పరిజ్ఞానం భూకంపామాలు రాకుండా చేయలేమా? పోనీ కనీసం తుపానుల మాదిరిగా ఫలానా సమయంలో భూ కంపం వస్తుందని చెప్పలేమా? అలా చెప్పగలిగితే ప్రజలను ముందుగానే భవనాలు, ఇళ్లూ ఖాళీచేయించి ప్రాణ నష్టం అరికట్టవచ్చు కదా! కాని దురదృష్ట మేమంటే భూ కంపాలను ఆపడం అసాధ్యం. భూ కంపాలు సంభవించే సమయాన్ని, ప్రాంతాన్ని గురించి ఖచ్చితంగా చెప్పడం కూడా ప్రస్తుత మానవ మేధకు అందని విషయం బహుశా సమీపకాలంలో జరగదేమో కూడా. అలా అని అంతా నిరాశాజనకం అని కూడా అనలేం. భూ కంపాలను గుర్తించడానికి చాలా పరిశోధనే జరుగుతోంది. భూమి పొరల కదలికలను కనిపెట్టడం జరుగుతోంది. ఈ కదలికల వల్ల ఎక్కడ, ఏ ప్రాంతంలో భూ కంపాలు రావచ్చునో చెప్ప గలుగుతున్నారు. పరిశోధనలు పెరుగుతున్న కొద్దీ, మరిన్ని మంచి పరికరాలు, కొత్త కొత్త పద్ధతులు వస్తున్న కొద్దీ ఈ సైన్సు శాఖలు (భూగర్భశాస్త్రం-జియాలజీ, భూకంపశాస్త్రం-సిస్మటాలజీ), వీటికి సంబంధించిన ఇతర శాఖలలో పరిశోధనలు బాగా పెరిగి మంచి ఫలితాలు వస్తున్నప్పటికీ ఇప్పటికిప్పుడు మాత్రం

భూ కంపాలను గురించి ఇదమిద్ధంగా చెప్పడం కష్టమే.

ఎందుకు చెప్పలేకపోతున్నారో తెలుసుకోవాలంటే ముందుగా భూకంపాలు ఎందుకు వస్తాయో కాస్తయినా చర్చించాలి. భూ ఖండాలు కదులుతున్నప్పుడూ, లేక భూమి అడుగున చర్యలు జరుగుతున్నప్పుడూ కొన్ని చోట్ల ఒకదానితో ఒకటి రాపిడి చెందుతాయి. అప్పుడు భూమి అడుగున కొంత ఒత్తిడి పేరుకుపోతుంది. ఈ ఒత్తిడి క్రమంగా పెరిగి ఒక దశలో భూమి పొరలు ఛేదించుకుని బయటకు వస్తుంది. ఒత్తిడి బయటకు వచ్చే కేంద్రాన్ని భూ కంప కేంద్రం అంటారు. అక్కడినుండి అన్నివైపులా భూ ప్రకంపలను వ్యాపిస్తాయి. ఈ ప్రకంపనల తీవ్రత కేంద్రం దగ్గర ఎక్కువగా ఉంటుంది. దూరం పోయే కొద్దీ బలహీనపడుతుంది. నిశ్చలమైన నీటిలో రాయి విసిరితే వచ్చే అలల మాదిరిగానే ఈ భూ ప్రకంపనలు వ్యాపిస్తాయి.



భూ ఖండాల కదలికల వల్ల భూమి పొరలమధ్య రాపిడి ఏర్పడి ఒత్తిడి ఏర్పడుతుందని చెప్పుకున్నాం. ఇలా భూమి పొరల మధ్య రాపిడి జరిగే ప్రాంతాలను ఫాల్ట్‌లైన్స్ (రాపిడి ప్రాంతాలు) అంటారు. పసిఫిక్ మహాసముద్రం చుట్టూ ఉన్న ప్రాంతాల్లో అత్యధిక భూకంపాలు సంభవిస్తాయి. కారణం పసిఫిక్ మహాసముద్రం కిందగల భూమి పొర, అట్లాంటిక్ మహా సముద్రం కింద ఉన్న భూమి పొరల మధ్య రాపిడే. పసిఫిక్ మహాసముద్రం కింద భూమి ప్రతి ఏడాదీ కొన్ని అంగుళాల చొప్పున తగ్గిపోతుంటే అట్లాంటిక్ మహాసముద్రం కింద ఉన్న భూమి పొర ఏటేటా కొన్ని అంగుళాలు విస్తరిస్తోంది. ఈ రెండు పొరలు రాపిడి జరిగే చోట పసిఫిక్ మహాసముద్రపు భూమి పొర కిందకు కృంగుతుంటే, అట్లాంటిక్ పొర దాని మీదికి ఎక్కుతోంది. దాని వల్ల భూమి అడుగున క్రమంగా ఒత్తిడి పెరిగి అక్కడక్కడా అది ఒక్కసారిగా పెల్లుబికి భూకంపాలు సంభవిస్తున్నాయి. ఒత్తిడి బయటకు వచ్చే చోట భూమి బ్రద్దలవుతోంది. పసిఫిక్ మహాసముద్రం చుట్టూ ఉండే ప్రాంతాల్లో భూ కంపాలు ఎక్కువగా రావడానికి ఈ ఫాల్ట్‌లైన్ (రాపిడి ప్రాతం) కారణం. మన దేశంలో హిమాలయ ప్రాతంలో కూడా ఇటువంటి రాపిడి ప్రాంతం ఉంది. భూమీ మీద ఇంకా చాలా చోట్ల ఇటువంటి రాపిడి ప్రాంతాలను భూగర్భ శాస్త్ర వేత్తలు గుర్తించగలుగుతున్నారు. ఈ రాపిడి వల్ల ఒత్తిడి పెరుగుతున్న తీరునూ గమనించగలుగుతున్నారు. కాబట్టి ఆ ప్రాంతాల్లో భూ కంపాలు సంభవించవచ్చునని వారు చెప్పగలుగుతున్నారు. ఇటువంటి ప్రాంతాల్లో ఒక సారి భూకంపం వస్తే మళ్లీ క్రమంగా ఒత్తిడి పెరగడాన్ని కొలవగలుతున్నారు. దాని వల్ల భూకంప ప్రమాద ప్రాంతాన్ని గుర్తించగలుగుతున్నారు. కాని విస్తారమైన ప్రాంతంలో ఈ ఒత్తిడి ఖచ్చితంగా ఏ కేంద్రం నుండి బయటకు వస్తుంది, ఎంత ఒత్తిడి వస్తే అది బయటకు వస్తుంది అనేది చెప్పలేకపోతున్నారు. కాబట్టి ఖచ్చితంగా ఈ సమయంలో భూ కంపం సంభవిస్తుందని చెప్పలేకపోతున్నారు. భూమి పొరల స్వభావం వగైరా అనేక కారణాల వల్ల కొన్ని చోట్ల తక్కువ ఒత్తిడి ఉన్నప్పుడే భూకంపం సంభవించవచ్చు. కొన్ని చోట్ల ఒత్తిడి బాగా పెరిగిన తరువాత కూడా సంభవించకపోవచ్చు. ఉదాహరణకు అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలోగల పార్క్ ఫీల్డ్ వద్ద ఒక రాపిడి ప్రాంతం ఉంది. చరిత్రలో నిర్దిష్ట సమయంలో ఇక్కడ రిక్టర్ స్కేలుపై 6.0 దాటిన భూ కంపాలు సంభవిస్తున్నందున దాన్ని గురించి శాస్త్రవేత్తలు అన్ని రకాల శాస్త్రపరిశోధనాంశాలనూ జోడించి 1988-92 మధ్య ఎప్పుడైనా మళ్లీ అక్కడ 6.0 తీవ్రతగల భూకంపం సంభవించ వచ్చునని అంచనా కట్టారు. నిజంగానే అక్కడ భూ కంపం వచ్చింది. 6.0 తీవ్రమైన భూకంపమే. కాని వాళ్లు చెప్పిన సమయంలో కాదు. 2004లో వచ్చింది. ఈలోగా వాళ్లు 'హెచ్చరిక చేసిన సమయం' (విండో పీరియడ్) అయిపోయింది. దీనికి భిన్నమైన ఇంకో ఉదాహరణ 1975లో చైనాలో జరిగింది. హైచెంగ్ రాష్ట్రంలో 7.3 తీవ్రత గల భూకంపం రాబోతోందని చైనా శాస్త్రవేత్తలు అంచనా వేశారు. దాంతో చైనా ప్రభుత్వం అక్కడి ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించింది. అనుకున్న సమయానికి నిజంగానే అంతటి తీవ్రమైన భూకంపం వచ్చింది. దాంతో పెద్ద ప్రాణ నష్టం తప్పింది. దీనికి కారణం. శాస్త్రవేత్తల పరిశోధనలకు అందిన అనేక సూచనలు స్పష్టంగా బయటపడ్డాయి. భూమి కింద కదలికలు రావడం, భూగర్భ జల ప్రవాహాల్లో అకస్మాత్తుగా మార్పులు రావడం, కొన్ని చోట్ల భూమి పైకి ఉబికి రావడం, జంతువులు విచిత్రంగా ప్రవర్తించడం వంటి అనేక సూచనలు కనిపించాయి. కాని అన్ని సమయాల్లో సూచనలు ఇంత స్పష్టంగా ఉండవు. అందువల్లనే మరుసటి సంవత్సరం, అంటే 1976లో చైనాలోనే టాంగ్‌షాన్ ప్రాంతంలో 7.6 తీవ్రతతో వచ్చిన భూకంపాన్ని శాస్త్రవేత్తలు చెప్పలేకపోయారు. ఈ భూకంపానికి 2,50,000 మంది చనిపోయారు.

ఆ విధంగా ప్రస్తుతం శాస్త్రవేత్తల పరిశోధనలకు అందని అనేక అంశాలు ఇమిడి ఉన్నందున భూకంపాలను ముందుగానే అంచనా వేయడం కష్టం అవుతోంది. ప్రస్తుతం అని ఎందుకంటున్నామంటే భవిష్యత్తులో ఇంకా అనేక పరికరాలూ, పద్ధతులూ అభివృద్ధి చెంది భూ కంపాలు ఖచ్చితంగా ఎక్కడ వస్తాయో, ఎప్పుడు వస్తాయో కనుక్కోవచ్చు. అయితే దానికి చాలా కాలం పట్టవచ్చు. కాని ఇప్పటికిప్పుడు మాత్రం భూ కంపవిలయం నుండి మానవ ప్రాణాలు రక్షించే అవకాశాలు మనవద్ద ఉన్నాయి. భూ కంపం సంభవించే అవకాశాలు గల రాపిడి ప్రాంతాలను శాస్త్రవేత్తలు గుర్తించగలుగుతున్నారు. ఈ ప్రాంతాల్లో నిర్మించే ఇళ్ల విషయంలో ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకుంటే ఈ విలయాలను ఆపవచ్చు. కనీసం బాగా తగ్గించవచ్చు. జపాన్ దేశమే ఇటువంటి ప్రాంతంలో ఉంది కాబట్టి అక్కడ భవన నిర్మాణ ఇంజినీరింగ్‌లోనే మార్పులు చేసి పెద్ద పెద్ద భూకంపాలను తట్టుకునే విధంగా భవనాలు నిర్మిస్తున్నారు. కాబట్టి పెద్ద భూకంపాలు వచ్చినా ప్రాణ నష్టం పెద్దగా ఉండడం లేదు. చైనాలోకూడా ఇటీవల భవన నిర్మాణ నిబంధనలు కఠిన తరం చేసి భూకంపాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. అందువల్లనే ఇప్పుడు అక్కడ 7.8 తీవ్రమైన భూ కంపం, మానవావాస ప్రాంతంలో వచ్చినా సాపేక్షంగా తక్కువ ప్రాణనష్టంతో బయటపడ్డారు. కాని అనేక రాపిడి ప్రాంతాలున్న మన దేశంలో మాత్రం భవన నిర్మాణాల సందర్భంగా ఈ అంశాన్నే పరిగణనలోకి తీసుకోవడం లేదు. మనకు మానవ ప్రాణాల లెక్కల కన్నా డబ్బు లెక్క ముఖ్యం కదా!

❋



భూసంస్కరణలు-వ్యవసాయ రంగం అవగాహనకు...

ప్రపంచీరణ కారణంగా చోటుచేసుకుంటున్న మార్పులు సమాజాలను అతలాకుతలం చేస్తూ జీవితాలను, సమాజాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక సమస్యలు పెరుగుతున్నాయి. వీటిని అర్థం చేసుకునేందుకు ప్రధానంగా వ్యవసాయ రంగం, భూసంస్కరణలు, ఉపాధి, పరపతి, సహకారం, ప్రజాపంపిణీ వ్యవస్థలు కీలకంగా ఉంటాయి. ఈ రంగాలను, వాటి సమస్యలను అర్థం చేసుకుంటే సామాజిక సమస్యలు అవగాహనకు వస్తాయి. దేశం పురోగమిస్తున్న తీరు, ప్రభుత్వాలు చెబుతున్న అభివృద్ధి సంగతులు, వాస్తవ పరిస్థితులు అర్థమవుతాయి. సామాజిక పరిస్థితిపై విశ్లేషణాత్మక అవగాహన కలుగుతుంది. సమస్యను ఇతరులకు విడమర్చి చెప్పనూగలరు. పరీక్షల్లోనూ ఇతరత్రానూ అడిగిన రీతిలో రాయనూగలరు. అందుకనే సామాజిక సమస్యలు, పరిస్థితులపై సరైన అవగాహన కల్పించడం కోసం ప్రజాశక్తి బుక్‌హౌజ్ 'భూసంస్కరణలు వ్యవసాయ రంగం : ఉపాధి-పంపిణీ- సహకారం- పరపతి సమస్యలు' అన్న పుస్తకాన్ని ప్రచురించింది. ఇందులో భూ సంస్కరణలు, వ్యవసాయం, పరపతి-సహకారం, ఉపాధి, ప్రజాపంపిణీ విభాగాల కింద సమాచారం అందుతుంది. ఒక్కొక్క విభాగంలో ఆర్టికల్స్‌ను ఒక క్రమ పద్ధతిలో అందించారు. ఒక విభాగంలోని వ్యాసాలను వరుసగా చదివిన వారికి సబ్జెక్టుపైన ఒక సమగ్ర అవగాహన కలుగుతుంది. ఆలోచనను రేకెత్తిస్తుంది. అవసరమైన రీతిలో దానిని ప్రెజెంట్ చేసే స్పష్టత వస్తుంది. ఆయా రంగాల్లో సుదీర్ఘానుభవం గల రచయితలు రాసినవి కాబట్టి ప్రతి వ్యాసమూ ఒక సమాచార ఆణిముత్యమే అయింది. అందుకని ప్రస్తుతం కాంపిటీషన్ పరీక్షలు రాస్తున్న వారికి, సమాజంపై అవగాహన కలిగించుకోవాలనుకునే వారికీ పుస్తకం ప్రత్యేక సమాచాం దీపికగా అందివచ్చింది. పుస్తకంలోని వ్యాసాలు రాసిన ఎం.ఎస్. స్వామినాథన్, ప్రభాత్ పట్నాయక్, ఉత్సా పట్నాయక్, జయతిఘోష్... భూసంస్క రణలు, వ్యవసాయం, సహకారం, పరపతి రంగాల కార్యక్రమాల్లోనూ, ప్రజలను చైతన్య పరిచే సమాచార మందించడంలోనూ కాకలుదీరిన వారు. వీరు రాసిన ఈ పుస్తకంలోని వస్తుగత విషయం, ప్రామాణికత, సాధికారత గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇలాంటి వారు రాసిన పుస్తకం లోని సమాచారం గ్రూప్- 1&2 పరీక్షలు రాస్తున్న ఉద్యోగార్థులకు అత్యంత అవసరం. ఈ పుస్తకం చదవకుండా ఉద్యోగార్థులు పరీక్షల్లో ఎక్కువ మార్కులు సంపాదించ లేరనడం అతిశయోక్తి కాదు. అందుకని ప్రతి ఉద్యోగార్థీ దీనిని తప్పక చదివి తీరాలి.

భూసంస్కరణలు వ్యవసాయ రంగం : ఉపాధి-పంపిణీ-సహకారం- పరపతి సమస్యలు

పేజీలు : 304, వెల : రు.100,

ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌజ్ అన్ని బ్రాంచీలు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన బుక్‌స్టాళ్ళు, షాపుల్లోనూ లభిస్తాయి.

బుక్‌హౌజ్ చిరునామా :

1-1-187/1/2, చిక్కడ పల్లి, హైదరాబాద్ - 500 020/ ఫోన్ నెం. : 040- 2766 0013

- నేలంటి మధు



భ్రమల్నిమోసుకుంటూ...

కవిత్వం

కె.జె. రమేష్

వెల:50/-, పేజీలు:80

ప్రతులకు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

4-1-43 బ్యాంక్ స్ట్రీట్

విజ్ఞాన్ భవన్, హైదరాబాద్.

గుంటూరు నానీలు

కె.జె. రమేష్

వెల:40/-,

పేజీలు:47

ప్రతులకు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

4-1-43 బ్యాంక్ స్ట్రీట్

విజ్ఞాన్ భవన్, హైదరాబాద్



ఈ పుస్తకం గొప్ప స్నేహితురాలు

కవిత్వం వస్తు పరమా? శిల్ప పరమమా? అనే చర్చ ఈనాటిది కాదు. ఈ చర్చ విషయం ఏమైనప్పటికీ సమాజంలోని సామాన్య ప్రజలకు చెందిన సమస్య వస్తువుగా గల కవిత్వానికి శిల్పం అదనపు ప్రయోజనం చేకూర్చుతుందని చెప్పొచ్చు. అయితే వస్తు శిల్పాల మధ్య సరైన అవగాహనతో కూడిన విభజన రేఖను పాటిస్తే కవిత్వం కళాఖండంగా రూపుదిద్దుకుంటుంది. నిద్రాణంలో వున్న ప్రజలను తట్టి లేపే కవిత నడకకు శిల్పం పరుగునందిస్తుంది. శిల్పాన్ని విస్మరించిన కవిత్వం సాగిలపడి కవిత్వ ప్రయోజనం దెబ్బతింటుంది. ఈ విషయాన్ని గమనిస్తే డా॥ వి. వరలక్ష్మి మంచి కవిత్వాన్ని అందిస్తోందన్న భరోసా ఇవ్వవచ్చు. ఈమె వృత్తిరీత్యా వైద్యురాలు. ఈమె ఆలోచన నిరంతర ప్రవాహి. సామాజిక స్పృహతో తన అనుభవంలోకి వచ్చిన సమస్యలకు అక్షరాలను పేర్చారు. వీటిల్లో ఓ హెచ్చరిక, కుటుంబజీవనానికి దూరమవుతున్న ప్రజలపై సానుభూతి కన్పిస్తుంది. తను రాసుకున్న అక్షరాలను భావతరంగాలుగా అచ్చు వేయించుకొన్నారు. దీన్ని ఆమె కవిత్వం అంటూ పాఠకులకు పరిచయం చేయలేదు. తన భావాలను పది మందితో పంచుకోవాలన్న అభిలాష మాత్రమే' అన్న మాటల్లోని నిజాయితీ పాఠకులను ఈ పుస్తకం చదివిస్తుంది. సమాజంలో అనేక రుగ్మతలపై సందర్భానుసారంగా రాసిన కవితలు ఇందులో ఉన్నాయి. ఇవి ఆమె "ఉద్వేగ భావశకలాలు". ఈ కవితల నిండా ఆమె సున్నితమైన మనసు పరుచుకొని ఉంది. వీటిని కవితలుగా కాకుండా ఓ మంచి మనస్సుతో మాట్లాడుతున్నట్లుగా భావిస్తే ఈ పుస్తకం ఒక గొప్ప స్నేహితురాలవుతుంది.

'నీ కంటి పాపలో నిలిచిన నేను / ఆ కనురెప్పల మధ్య బంధీని / హృదయ కవాటాల చాటున దాగిన ఓ ప్రేమ ఖైదీని / కలకాలం నీ ఇంటి దీపాన్ని' అంటున్న డాక్టర్ వరలక్ష్మి సాహిత్యలోకానికి పిలువని ఆత్మ బంధువు. అంతే కాదు హైదరాబాద్ నగరంలో జరిగే అనేక సాహిత్య సభలకు మొదటి ప్రేక్షకురాలు. ఉద్యోగరీత్యా తీరిక లేకపోయినప్పటికీ పాటతో, మాటతో, అక్షరం తో అందరికీ ఆప్తురాలు. అసహనాన్ని సైతం మృదువుగా చెప్పగల ఈ కవయిత్రి కవిత్వానికి సంబంధించి కొంత అభ్యసనం చేస్తే సాహిత్య లోకానికి చుక్కాని అవుతుంది.

భావతరంగాలు

డా॥ వరలక్ష్మి .వి,

వెల-50/-

ప్రతులకు:

అన్ని ప్రముఖ పుస్తక షాపులు.

- ఐనాల సైదులు





చేప తెలివి చెప్పతరమా!

ఎక్కడైనా చేప ఫుట్‌బాల్ ఆడడం చూశారా! పోనీ...బాస్కెట్ బాల్ ఆడడం కన్నారా! అదీ ఇదీ కాకపోతే లింబో డాన్స్ చేయడం గమనించారా! చూడకపోయినా కనీసం విన్నారా! ఏదీ లేదా! అయితే మీ ముందున్న చేప గురించి చెప్పాల్సిందే. ఈ గోల్డ్‌ఫిష్ పేరు కామెట్. వయసు రెండేళ్లు. ఇది మనం ఇందాక చెప్పకున్నవన్నీ చేసేస్తుంది చకచకా. అంతే కాదు! చిన్న రింగ్‌లోంచి, రాడ్ కింది నుంచి, రెండు వైపుల తెరచి వున్న డబ్బాలోంచి... సులువుగా దూరి వస్తుంది. అచ్చంగా మనిషి చేసినట్టే చేస్తుంది. ఇప్పుడు మనకు ఒక డౌట్ వస్తుంది. దానికి అవన్నీ నేర్పినదెవరబ్బా... అని. ఇంతచెప్పాక గురువును పరిచయం చేయకుండా ఎలా వుంటాం చెప్పండి! డాక్టర్ డీన్ పోమెర్లూ. కాలిఫోర్నియా వాసి. ఎంతో జాగ్రత్తగా ఈ చేపకు శిక్షణనిచ్చాడు. చేపకు ఎలా నేర్పారు? అనడిగితే.. డాల్ఫిన్లకు మల్లే దీనికీ ట్రైనింగ్ ఇచ్చానంటాడు సింపుల్‌గా. అంతేకాదు. చేపలకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన కిట్లను కూడా డిజైన్ చేశాడాయన.









పగటి కల



కథా నిలయం
చూడీ
శ్రీకాకుళం

ఒక ఊరిలో ఓ బ్రాహ్మణుడు వుండేవాడు. అతనికి అమ్మానాన్న, బంధువులు, స్నేహితులు... ఎవరూ లేరు. అనాథ. అదే అతని బాధ. ఎప్పుడూ దాని గురించే ఆలోచిస్తుండేవాడు. తోచినప్పుడు లేచి నాలుగు వీధులు తిరిగి భిక్షాటన చేసి కడుపు నింపుకునేవాడు. ఎవరైనా ఏదైనా ఇస్తే... జాగ్రత్తగా తెచ్చి ఉట్టిలో దాచుకుని... ఆకలేసినప్పుడు తీసుకొని తినేవాడు. అలా గడిచిపోతుండేది అతని జీవితం.

అయితే అతనికి ఒక చిన్ని పూరి గుడిసె వుంది. అందులోనే అతని నివాసం. అందులో ఒకే ఒక్క కుక్కి మంచం... ఒక ఉట్టి...చిన్న దండెం. దాని మీద ఒక పంచె, కండువా...గుమ్మం పక్కన ఒక బాన, బానమీద గ్లాసు...ఇవే అతని ఆస్తిపాస్తులు. తన దరిద్రాన్ని చూసి చింతించడం మినహా మరేం ఆలోచించేవాడుకాదు బ్రాహ్మణుడు.

ఎప్పటిలాగే ఓరోజు యాచనకు వెళ్లాడు. ఎన్ని వీధులు తిరిగినా ఎవ్వరూ ఏమీ పెట్టలేదు. ఏంటో ఎవరింటికెళ్లినా...'వంట కాలేదు. కాసేపాగిరా' అన్నారు. కానీ ఓ మహిళ మాత్రం అతనికి పేలపిండి పెట్టింది. దాన్ని తీసుకొచ్చి ఉట్టిలో వున్న కుండలో పోసి నులక మంచంలో పండుకుని ఆలోచనలో పడిపోయాడు. ఆ ఉట్టిలో వున్న పేలపిండిని ఎవరికైనా అమ్మితే కొంత పైకం వస్తుంది. ఆ డబ్బుతో రెండు మేకలను కొనొచ్చు. ఆరు నెలలు తిరిగేసరికి వాటికి పిల్లలు పుడతాయి. అలా మేకల మంద తయారవుతుంది. వాటిని అమ్మేసి వచ్చిన డబ్బుతో గేదెలు, ఆవులు కొనొచ్చు. అవి పాలిస్తాయి. వాటికి పిల్లలు పుడతాయి. అవి కూడా పెద్దయ్యాక పాలిస్తాయి. ఆ పాలన్నీ సంతలో అమ్మితే పైసలు వస్తాయి. ఇంకా పాలను తోడుపెడితే పెరుగు, వాటిని చిలికితే వెన్న వస్తుంది. వాటినీ అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. అలా పైకం కూడబెట్టి... బాగా ధనవంతుడు అయిపోవచ్చు.

ఆ డబ్బుతో పేద్ద భవనం కొనుక్కోవచ్చు. ఇంటి నిండా కుర్చీలు, మంచాలు, బీరువాలు...ఇంటి చుట్టూ పూదోట, కాలు తీసి కాలు వేస్తే సేవకులు వుంటారు. ఈ దర్జా చూసి గొప్పింటి సంబంధం వస్తుంది. అందమైన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాను. ఇద్దరం చిలకా గోరింకల్లా కాపురం చేసుకుంటాం. బాబు పుడతాడు. వాడికి సోమ శర్మ అని పేరు పెడతాం. వాడు మెల్లగా పెరిగి పెద్దవుతుంటాడు. అప్పుడు నా మాట వినకుండా అల్లరి చేస్తుంటాడు. అప్పుడు నేను ఒక కర్ర తీసుకొని వాడి వెంట పడి ఒక్కటిచ్చి చెవి పట్టుకొని లాక్కొస్తాను అనుకుంటూ... గుమ్మం పక్కన వున్న కర్రను తీసుకొని వుట్టిమీది కుండను ఒక్కటిస్తాడు. అంతే కుండ 'ఫట్'మని పగిలిపోయి పేలపిండి ఇల్లంతా పడుతుంది. అది చూశాక గానీ అప్పటి వరకు తను కలగన్నానన్న విషయం బ్రాహ్మణుడికి అర్థంకాదు. పగటి కల కంటూ వున్న పేల పిండిని కాస్త నేలపాలు చేసుకొన్నందుకు ఏడుస్తూ కూర్చుంటాడు.